ఆదివారం
12-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 259
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

చైనా కొత్త ప్రధానిగా లీ క్యాంగ్

చైనా కొత్త ప్రధానిగా లీ క్యాంగ్ (63) ఎన్నికయ్యారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడైన లీ క్యాంగ్‌ను జిన్‌పింగ్ స్వయంగా నామినేట్ చేశారు. శనివారం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) సమావేశాల్లో భాగంగా ప్రధానితోపాటు మరికొందరు ఉన్నతాధికారులను ఎన్నుకున్నారు.

2లో



పట్టభద్రుల ఓటర్లుగా నిర్లక్ష్యరాస్యులు

- ఒక్క తిరుపతిలోనే 15వేల నకిలీ ఓట్లు
- ఎన్నికల పారదర్శకతకు హామీ ఇవ్వాలి
- నకిలీ ఓట్లు తక్షణమే తొలగించాలి
- సీఈసీకి సీపీఐ కార్యదర్శి నారాయణ లేఖ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తిరుపతిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల క్రమంలో 15వేల నకిలీ ఓటర్లు ఉన్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుర్తించింది. ఇదే విషయాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఈసీ) దృష్టికి సీపీఐ కార్యదర్శి కె.నారాయణ తీసుకెళ్లారు. ఇందుకోసం ఆయన శనివారం ఓ లేఖ రాశారు. ఒక్క తిరుపతిలోనే పట్టభద్రులు కాని 15వేల నకిలీ ఓటర్లు నమోదై ఉన్నారని, ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారని, వీరికి పట్టభద్రుల నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయనిస్తే ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతుందని లేఖలో నారాయణ పేర్కొన్నారు. 'బుధవారం తిరుపతిలోని

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదు
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీజరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు శనివారం రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. లేఖ సారాంశం ఇలా ఉంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజాస్వామ్యం నిరంతర దాడికి గురవుతోంది. ఇందులో భాగంగా పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికను కూడా ఒక ప్రహసనంగా మార్చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కనుసన్నల్లో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోంది. ప్రభుత్వ టెర్రరిజంతో పరిశ్రమలు పారిపోతున్నాయి. నిరుద్యోగం పెరిగిపోయింది. యువత భవిష్యత్ అంధకారం అయ్యింది. నేడు ఈ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ గురించి, డీయస్సీ గురించి ఎలా మోసం చేసిందో కూడా చూశాం. ఇక ప్రభుత్వంలో భాగం అయిన ఉద్యోగులకు ఎప్పుడూ తగిన ప్రాధాన్యం ఇచ్చాం. విభజన కష్టాలు ఉన్నా ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చాం. వారికి తగు గౌరవం ఇచ్చాం. ప్రభుత్వ ఉద్యోగులకు అడిగినంత ఫిట్‌మెంట్ కాదు కదా... కనీసం ఏ నెల జీతం ఆ నెల ఇచ్చే పరిస్థితి కూడా నేడు లేదు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద పెట్టి ఎలా అవమానించారో కూడా రాష్ట్రం మొత్తం చూసింది. ఈ అన్ని అంశాలను యువత, పట్టభద్రులు, ఉద్యోగులు, టీచర్లు గుర్తుపెట్టుకోవాలని కోరుతున్నాను. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అక్రమాలు మనం చూశాం. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయకుండా హింసకు పాల్పడింది. అధికార దుర్వినియోగంతో ఎన్నికల్లో పోటీ చేసే హక్కును హరించింది. ఎన్నికల్లో అక్రమాలు అనే విధానానికి అలవాటుపడిన ఈ ప్రభుత్వం... ఇప్పుడు ఆదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు, ఫోర్జరీలకు తెరతీసింది. అడ్డదారులతో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోంది. దీనిపై

- మిగతా 2 లో

త్రిపురలో బీజేపీ తాలిబన్ రాజ్

- వామపక్ష, కాంగ్రెస్ ఎంపీల బృందం విమర్శ
- ప్రతినిధి బృందంపై కాషాయ మూకల దాడి - ముగ్గురి అరెస్ట్

అగర్తల: త్రిపురలో బీజేపీ 'తాలిబన్ రాజ్' సాగుతోందని వామపక్ష-కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధుల బృందం విమర్శించింది. అధికార దుర్వినియోగం, ధనబలాన్ని ప్రయోగించినప్పటికీ బీజేపీ స్వల్ప మెజారిటీతో అధికారంలోకి రాగలిగిందని, అది జీర్ణించుకోలేక రాజకీయ ప్రత్యర్థులపై, కార్మిక, కర్షక సంఘాల కార్యకర్తలపై ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచే హింసాత్మక దాడులు ప్రారంభించిందని విమర్శించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హింసకు పాల్పడింది. ఆయా ఘటనలపై విచారణ కోసం ఆ రాష్ట్రానికి వెళ్లిన వామపక్ష, కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధి బృందంపై శుక్రవారం బీజేపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. హింసాత్మక ఘటనలు జరిగిన పశ్చిమ త్రిపురలోని సెపాహిజాల, గోమతి జిల్లాల్లో పర్యటించి బాధిత కుటుంబాలతో మాట్లాడేందుకు ఎంపీలు ప్రయత్నించిన సమయంలో దాడి జరిగిందన్నారు. సెపాహిజాల జిల్లాలోని బిషాల్‌గఢ్ సబ్‌డివిజన్‌లోని సరిహద్దు గ్రామమైన నేహాల్‌చంద్ర నగర్‌లో ఎంపీలపై దాడి జరిగింది. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేసి, ఇతర నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసు సీనియర్ అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో భద్రతా బలగాలను

- మిగతా 2 లో

లెఫ్ట్ నేతలపై ఫాసిస్టు దాడులు ఆక్షేపణీయం

దోషులను తక్షణమే అరెస్టు చేయాలి: సీపీఐ డిమాండ్

న్యూఢిల్లీ: త్రిపురలో లెఫ్ట్ నేతలపై ఫాసిస్టు దాడులకు తెగబడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు హితవు పలికింది. మరోమారు నేతలపై దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని త్రిపుర సీఎంకు సూచించింది. ఎన్నికల హింసపై విచారణ కోసం ఆ త్రిపురలో పర్యటించిన లెఫ్ట్-కాంగ్రెస్ ప్రతినిధుల బృందంపై బీజేపీ వర్గాల దాడిని శనివారం ఓ ప్రకటనలో సీపీఐ తీవ్రంగా

- మిగతా 2 లో

ఓటమి భయంతోనే అక్రమాలు

- వైసీపీ తీరుపై రామకృష్ణ విమర్శ
- కత్తి, పోతులను గెలిపించాలని పిలుపు

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేకపాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓడిపోతామని తెలిసి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారాన్ని నిర్వహిస్తూ శనివారం ఉరవకొండకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అధికార మదంతో వ్యవహరిస్తున్నారనీ, ప్రతి ఎన్నికల్లోను తామే గెలవాలని ప్రతిపక్ష పార్టీలు ఉండకూడదని నియంతలా పనిచేస్తున్నారని విమర్శించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో జోక్యం చేసుకునే వారు కాదని ప్రస్తుత ముఖ్యమంత్రి అన్ని స్థానాలు తామే గెలవాలని విచ్చలవిడిగా అధికార దుర్వినియోగం, దొంగ ఓట్లు నమోదుతో పాటు ఓట్లు కొనుగోలుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారని చెప్పారు. మద్యంలో సంపాదించిన డబ్బును ఓట్లు కొనుగోలుకు ఖర్చు పెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారనీ, 31 మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కను సన్నల్లో సీఎం పనిచేస్తున్నారని పేర్కొన్నారు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికలలో మేధావులు

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ ఎన్నికలు హోరాహోరీ

- ముగిసిన ప్రచారం
- రేపు పోలింగ్‌కు సర్వం సిద్ధం
- భారీ పోలీస్ బందోబస్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 13న జరగునున్న గ్రాద్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాలతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది స్థానిక సంస్థలతో పాటు, మూడు గ్రాద్యుయేట్స్, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటిలో స్థానిక సంస్థల నుంచి ఇప్పటికే ఐదు స్థానాలు వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, మిగిలిన స్థానాల్లోనూ అధికారపార్టీ అభ్యర్థులే విజయం సాధించనున్నారు. గ్రాద్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో మాత్రం పోటీ ఢీ అంటే ఢీ అనేలా ప్రచారం సాగింది. ముఖ్యంగా ఉపాధ్యాయ నియోజకవర్గాలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రస్తుతం ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఎట్టిపరిస్థితుల్లో ఈ రెండు నియోజవర్గాలను గెలుచుకోవాలన్న ధ్యేయంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అనేక విధాలుగా ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడుతున్నారు. దీనిపై ఇప్పటికే విపక్షాలకు చెందిన అభ్యర్థులు ఈసీకి ఫిర్యాదులు కూడా

- మిగతా 2 లో

చైనా కొత్త ప్రధానిగా లీ క్యాంగ్

ఎన్‌పీసీలో ఎన్నిక- ప్రకటించిన జిన్‌పింగ్

బీజింగ్: చైనా కొత్త ప్రధానిగా లీ క్యాంగ్ (63) ఎన్నికయ్యారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడైన లీ క్యాంగ్‌ను జిన్‌పింగ్ స్వయంగా నామినేట్ చేశారు. శనివారం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) సమావేశాల్లో భాగంగా ప్రధానితోపాటు మరికొందరు ఉన్నతాధికారులను ఎన్నుకున్నారు. లీ క్యాంగ్ ప్రధానిగా ఎన్నికైనట్లు జిన్‌పింగ్ ప్రకటించారు. పదేళ్లు దేశానికి ప్రధానిగా ఉన్న లీ కియాంగ్ (67) స్థానంలో లీ క్యాంగ్ ఎన్నిక ఏకగ్రీవం కాదు. 2,947 మందిలో నుంచి 2,936 మంది ఎన్‌పీసీ సభ్యులు లీ క్యాంగ్‌కు ఓటేశారు. ఆయనకు మూడు వ్యతిరేక ఓట్లు రాగా ఎనిమిది మంది ఓటింగ్‌లో పాల్గోలేదు. ఎన్నిక అనంతరం లీ క్యాంగ్ నియామక పత్రాలపై అధ్యక్షుడు జిన్‌పింగ్ సంతకం చేశారు. ఆ తర్వాత లీ క్యాంగ్ ప్రధానిగా ప్రమాణం చేశారు. అదే విధంగా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్‌సీ) సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) వైస్ చైర్మన్లుగా జాంగ్ యోజియా, హీ వెడాంగ్ ఎన్నికయ్యారు. పీఆర్‌సీ, సీఎంసీ చైర్మన్ జిన్‌పింగ్ నామినేషన్‌కు అనుకూలంగా 3000 మంది ఎన్‌పీసీ డిప్యూటీలు ఓటేశారు. సీఎంసీ సభ్యులుగా లి షాంగ్‌ఫు, లియూ ఝెన్లి, మియో హువా, జాంగ్ షెంగ్మిన్ ఎన్నికయ్యారు. జాతీయ కమిషన్ పర్యవేక్షణ డైరెక్టర్‌గా లియూ జింగువాను సభ్యులు ఎన్నుకున్నారు.

ముగిసిన 14వ సీపీపీసీసీ జాతీయ కమిటీ సమావేశం

చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) 14వ జాతీయ కమిటీ మొదటి సమావేశం శనివారంతో ముగిసింది. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జరిగిన ముగింపు సమావేశానికి జిన్‌పింగ్‌తో పాటు చైనా ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశానికి 14వ సీపీపీసీసీ జాతీయ కమిటీ చైర్మన్ వాంగ్ హునింగ్ అధ్యక్షత వహించారు. 14వ సీపీపీసీసీ జాతీయ కమిటీ తొలి సమావేశంపై రాజకీయ తీర్మానానికి, కొత్త ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది.

అమెరికాలో నోరోవైరస్ కలకలం

అంతుచిక్కని వ్యాధితో 300 మందికి అస్వస్థత

అంతా నౌక ప్రయాణికులే

వాషింగ్టన్: అమెరికాలో నోరో వైరస్ కలకలం రేపింది. అంతుచిక్కని వ్యాధితో 300 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు వంటి డయేరియా లక్షణాలతో బాధపడ్డారు. ఇది ఎలాంటి రోగమో వైద్యులకూ, అమెరికా అంటువ్యాధుల నియంత్రణ కేంద్రం(సీడీసీ) నిపుణులకు అంతుపట్టలేదు. వ్యాధిగ్రస్తులంతా ఓ పర్యాటక నౌకలో ప్రయాణికులు కావడం మరింత కలవరపెడుతోంది. టెక్సాస్-మెక్సికో మధ్య ప్రిన్సెస్ క్రూయిజ్‌కు చెందిన రూబీ ప్రిన్సెస్ నౌకలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 5వ తేదీ మధ్య ప్రయాణించిన 300 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరికి ఎలాంటి వ్యాధి సోకిందో నిపుణుల బృందానికి అర్థం కాలేదు. నమూనాలు సేకరించి టెక్సాస్‌కు పంపారు. అయితే చాలా వేగంగా వ్యాప్తి చెందే నోరోవైరస్ బారిన వీరు పడినట్లు క్రూయిజ్ యాజమాన్యం పేర్కొంది.

మే 14న టర్కీ అధ్యక్ష ఎన్నికలు

అంకారా: టర్కీ అధ్యక్ష ఎన్నికలను మే 14న నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ప్రకటించారు. రెండు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న ఆయన మరోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు. దశాబ్దంగా దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఎన్నికలుగా వీటిని పరిగణిస్తున్నారు. మరింత ప్రజాస్వామ్య పంథాలో పయనించడమా లేక బలమైన నేత ఎర్డోగన్ నిర్దేశించిన నిరంకుశ పంథాలో ముందుకు సాగడమా అనేది ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి. 2003 నుంచి ఎర్డోగన్ టర్కీని పాలిస్తున్నారు. మొదట ప్రధానిగా ఉన్న ఆయన 2014 నుంచి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తాజా ఎన్నికలు ఆయనకు పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఇటీవల సంభవించిన వరుస భూకంపాలతో సంభవించిన ప్రాణ-ఆస్తినష్టం, ప్రతిస్పందనపై ప్రజాగ్రహం, అసంతృప్తి, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం వంటి సమస్యలలో ఉక్కిరిబిక్కిరయ్యే టర్కీని తిరిగి ఏలడమంటే ఎర్డోగన్‌కు పెద్ద సవాల్‌గానే చెప్పాల్సి ఉంటుంది. టర్కీ భూకంప మృతుల సంఖ్య 47వేలుగా ఎర్డోగన్ శుక్రవారం వెల్లడించారు. మరోవైపు ఆరు ప్రతిపక్ష పార్టీలు ఏకమై ఎర్డోగన్‌ను ఎదుర్కొనేందుకు నడుం బిగించాయి.

పట్టభద్రుల ఓటర్లుగా నిరక్షరాస్యులు

(మొదటిపేజీ తరువాయి)

సుందరయ్యనగర్‌కు వెళ్లి అక్కడి ఓటర్ల జాబితాను పరిశీలించగా నకిలీ ఓటర్లు చాలామంది ఉన్నట్లు తెలిసింది. ఏదో విధంగా గెలవాలనే లక్ష్యంతో ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ పోలింగ్ రోజు గందరగోళం సృష్టించే యత్నాలలో ఉంది. ఒక ఇంట్లో 13 నకిలీ ఓట్లను గుర్తించగా ఇంకో చోట ఇంటి నంబరు తప్పుగా ఉంది. ఆ చిరునామాలో ఖాళీ స్థలం, పది నకిలీ ఓట్లున్నాయి. చదవడం, రాయడం కూడా తెలియని నిరక్షరాస్యులకు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేశారు. వార్డు వలంటీర్ ఇంట్లో పది నకిలీ ఓట్లు ఉంటే ఓ కార్మికుడి ఇంట్లో 12నకిలీ ఓట్లున్నాయి. సీపీఎం కార్యకర్త ఇంటినీ వారు వదల్లేదు. అక్కడ ఎనిమిది నకిలీ ఓట్లు నమోదై ఉన్నాయి' అని నారాయణ పేర్కొన్నారు.

సీపీఐ ఏపీ కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బృందం ఆ జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డిని కలిసి ఎన్నికల అధికారులను పారదర్శకంగా పని చేయనివ్వాలని కోరారు. వైఎస్‌ఆర్‌సీపీ మార్గదర్శకత్వంలో తిరుపతి పోలీసు అధికారులు పని చేస్తున్నారని ఆయన దృష్టికి నేతలు తీసుకెళ్లారు. పోలింగ్ పారదర్శకంగా జరగాలని, ఎటువంటి మోసాలకు అవకాశం ఇవ్వవద్దని విన్నవించారు. వేరే రాష్ట్ర పోలీసు అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ శాంతియుతంగా జరిపించాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఓటర్ల జాబితాను వారి ఓటర్ల జాబితాలోని సీరియల్ నంబర్లు, విద్యార్హతులతో పాటు స్థానిక సంబంధిత నాయకులకు వారు అందజేశారు. నమోదైన జాబితాలోని చిరునామాల్లో లేని నకిలీ ఓటర్ల గురించీ వివరాలను నేతలు అందజేశారు. నకిలీ ఓటర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఓటు వేయనివ్వరాదు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు వీలుగా ఓటర్ల జాబితాలోని 1 నుంచి 4 వరకు అనుబంధ పత్రాల్లో పేర్కొన్న నకిలీ ఓటర్ల తొలగింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం' అని సీఈసీకి రాసిన లేఖలో నారాయణ వెల్లడించారు. నకిలీఓటర్ల జాబితాను తన లేఖకు పొందుపర్చారు.

ఓటమి భయంతోనే అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగులు, ఉపాధ్యాయులు పట్టుభద్రులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు ప్రజాస్వామ్యానికి పాతరేసే విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి రాష్ట్రంలోని అన్ని పార్టీలు కూడా ఒకే వేదిక పైకి రానున్నట్లు ఆయన తెలిపారు ఎమ్మెల్సీ ఎన్నికల రోజు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ, ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలని ఆయన ఎన్నికల కమిషన్‌ను కోరారు, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ బలపరుస్తున్న భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డికి రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు ఎన్నికల ప్రచారంలో రామకృష్ణతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, ఉరవకొండ తాలూకా కార్యదర్శి జే మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, ఏఐటీయూసీ నాయకులు చెన్నారాయుడు, పార్టీ సీనియర్ నాయకులు శివన్న, శ్రీధర్, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, విడపనకల్లు కార్యదర్శి రమేష్, పార్టీ నాయకులు సంగప్ప, ఉరవకొండ కార్యదర్శి తలారి మల్లికార్జున, కూడేరు మండల కార్యదర్శి నారాయణమ్మ, మహిళా,విద్యార్థి ప్రజానాట్యమండలి సంఘం సభ్యులు పాల్గొన్నారు

టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు, ఓటర్లు చైతన్యంతో వ్యవహరించి కుట్రపూరిత వైసీపీకి బుద్ధి చెప్పాలని కోరుతున్నాను. గతంలో తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లు ఎలా వేశారో... ఏ స్థాయి అక్రమాలు చేశారో చూశాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బోగస్ ఓట్ల సంస్కృతికి అధికార వైసీపీ మళ్లీ తెరతీసింది. తిరుపతిలో ఇల్లు కూడా లేని ఖాళీ స్థలాల్లో ఓట్లు నమోదు చేశారు. ఏడవ తరగతి, టెన్త్, ఇంటర్ చదివిన వారిని, నిరక్షరాస్యులను పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేశారు. చివరికి వైసీపీ కార్యాలయం అడ్రస్ పెట్టి కూడా 38 బోగస్ ఓట్లు సృష్టించారు. ఒ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలోని ఒక్క తిరుపతి నగరంలోనే 7 వేలకు పైగా దొంగ ఓట్లు చేర్పించారు. ఇక ఉత్తరాంధ్రలో 5 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి ఇప్పటి వరకు బయట పడిన సంఖ్య మాత్రమే. మూడు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల ఓటర్ల జాబితాలో 20-30 శాతం వరకు దొంగ ఓట్లు ఉంటాయని పరిశీలనలో తేలింది. ఇక ఈ బోగస్ ఓట్లతో పాటు కానుకలు ఇచ్చి వైసీపీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేస్తోంది. ఓటర్లకు పెద్ద ఎత్తున వెండి నాణేలు పంచుతున్నట్లు తెల్సింది. టీచర్లు, గ్రాడ్యుయేట్లను గుర్తించి వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇచ్చి ప్రలోభపెట్టే స్థాయికి అధికార పార్టీ దిగజారింది. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదు.

అందుకే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మేము పీడీఎఫ్‌తో ఒక అవగాహనకు వచ్చాం. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాకు మొదటి ప్రాధాన్య ఓటు వేసిన తరువాత... రెండో ప్రాధాన్య ఓటు పీడీఎఫ్ అభ్యర్థులకు వేయాలని ప్రజలను, మా మద్దతుదారులను కోరుతున్నాం. ఇదే సందర్భంలో పీడీఎఫ్ అభ్యర్థులకు ఓటు వేసిన ఓటర్లను వారి రెండో ప్రాధాన్య ఓటు మాకు వేయాలని కోరుతున్నాం. ఉపాధ్యాయ ఎన్నికల్లో టీడీపీ పోటీలో లేనందునవల్ల టీడీపీ సానుభూతిపరులు పశ్చిమ రాయలసీమ టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌కు ఓటు వేయాలని చంద్రబాబు కోరారు.

16న మళ్లీ రావాలి

- కవితకు ఈడీ ఆదేశం
- దిల్లీ మద్యం కేసులో తాజా విచారణ
- ఎనిమిదిన్నర గంటలు వరుస ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి

న్యూదిల్లీ: దిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో బీఆర్ఎస్ నేత కె.కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శనివారం ప్రశ్నించారు. దిల్లీలో మద్యం విధానం అమలు క్రమంలో జరిగిన అవకతవకలు, మనీలాండరింగ్ వ్యవహారంలో ఆమెను విచారించారు. కవిత ఉదయం 11 గంటలప్పుడు ఈడీ కార్యాలయానికి చేరుకోగా దాదాపు ఎనిమిదిన్నర గంటల పాటు ఆమెను ప్రశ్నలకు అధికారులు ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈనెల 16న మరోమారు విచారణకు హాజరు కావాలని కవితకు సూచించారు. విచారణ ముగిసిన అనంతరం దిల్లీ, తుగ్లక్ రోడ్డులోని తన తండ్రి, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసానికి కవిత వెళ్లారు. అయితే ఈడీ ఆఫీసు నుంచి కవిత బయటకు రాగానే ఆమె మద్దతుదారులు జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. జై కవితక్క అంటూ నినదించారు. కవిత విచారణ క్రమంలో ఈడీ కార్యాలయం వద్ద బ్యారికేడ్లతో కట్టుదిట్టమైన భద్రతను అధికారులు ఏర్పాటు చేశారు. పోలీసులు హై అలర్ట్ ప్రకటించడం, మీడియాను, బీఆర్ఎస్ కేడర్‌ను ఈడీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో లేకుండా చర్యలు తీసుకున్నారు. కవిత ఫోన్లు ధ్వంసం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు, స్కామ్‌లో సౌత్ గ్రూప్ పాత్రపై అధికారులు విచారించారని తెలిసింది. ఇటీవల అరెస్టు అయిన అరుణ్ పిళ్లై రిమాండ్ రిపోర్ట్ ఆధారంగా కవితపై ప్రశ్నల వర్షం కురిపించారని సమాచారం. మాజీ ఆడిటర్ బుచ్చిబాబు వాట్సాప్ చాట్ ఆధారంగా ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. కవిత-పిళ్లై ఇద్దర్నీ కాన్‌ఫ్రాంటేషన్ ఇంటరాగేషన్ ద్వారా అధికారులు విచారించారు. కవితతో పాటు మొత్తం 9 మందిని ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మనీశ్ సిసోడియా, కవిత, అరుణ్ రామచంద్రన్ పిళ్లై, దినేశ్ అరోరా, బుచ్చిబాబు, సిసోడియా మాజీ కార్యదర్శి అరవింద్, ఎక్సైజ్ శాఖ మాజీ అధికారులు కుల్దీప్ సింగ్, నరేంద్ర సింగ్‌ను విడివిడిగా, కలిపి ఈడీ ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం

కవితను అడిగిన ప్రశ్నలివే...

దిల్లీ మద్యం పాలసీలో మార్పులు చేసింది మీరేనా..? ఈ మార్పులు చేర్పులు వెనుక ఎవరెవరి పాత్ర ఉంది.. మనీష్ సిసోడియాతో పరిచయం ఎలా ఏర్పడింది..? దిల్లీ ప్రభుత్వానికి దక్షిణ సంఘానికి (సౌత్‌గ్రూప్)కు మధ్యవర్తి మీరేనా..? దిల్లీ మద్యం వ్యాపారంతో సంబంధమేంటి..? మద్యం కుంభకోణంలో మీ పాత్ర ఉందా.. లేదా..? అరుణ్ రామచంద్ర పిళ్లై మీకు బినామీనా కాదా..? మీ ప్రతినిధని పిళ్లై చెప్పిన దాంట్లో నిజమెంత..? పిళ్లైకు.. మీకు (కవితకు) మధ్య ఆర్థిక లావాదేవీలు ఏమైనా జరిగాయా..? రామచంద్రతో వ్యాపారం చేస్తే నాతో చేసినట్లే అని మీరు చెప్పలేదా..? సౌత్‌గ్రూప్‌తో మీకున్న సంబంధాలేంటి..? ఛార్టెడ్ ఫ్లైట్‌లో వెళ్లి రూ. 130 కోట్లు లంచం ఇచ్చారా..? 130 కోట్లు డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింది.. ఎవరిచ్చారు..? ఛార్టెడ్ ఫ్లైట్ మీకు ఎవరు సమకూర్చారు..? ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఎప్పుడైనా కలిశారా..? ఫేస్‌టైమ్‌లో మీరు సమీర్ మహేంద్రుతో మాట్లాడారా.. లేదా..? శరత్ చంద్రారెడ్డిని ఎన్నిసార్లు కలిశారు..? శరత్‌తో తరుచూ మాట్లాడాల్సిన అవసరం ఏంటి..? ఆధారాలు మాయం చేసేందుకు సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారా..? సెల్‌ఫోన్లు ఎందుకు ధ్వంసం చేశారు..? గోరంట్ల బుచ్చిబాబుకు మీకున్న సంబంధమేంటి..?

బీసీలను ఓట్ల యంత్రాలుగా మార్చిన వైసీపీ

- రాజ్యాధికారాన్ని అర్థించడం కాదు..సాధించుకోవాలి
- బీసీ సదస్సులో జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి : బీసీలు రాజ్యాధికారం అర్థించటం కాదు.. సాధించుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలు కలిస్తే రాజ్యాధికారం ఇంకెవరికీ దక్కదన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను ఓట్ల యంత్రాలుగా మార్చిందన్నారు. ఇన్నేళ్లుగా బీసీల సమైక్యత ఎందుకు సాధ్యం కాలేదో అర్థం కావట్లేదన్నారు. గతంలో 93 ఉన్న బీసీ కులాలు ఇప్పుడు 140కి ఎందుకు పెరిగాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మన రాష్ట్రానికి వస్తే జనసేన ఆహ్వానించిందన్నారు. తెలంగాణలో 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించడంపై బీఆర్ఎస్ స్పందించాలన్నారు. అన్యాయంపై బీఆర్ఎస్ వివరణ ఇవ్వాలని, బీసీ కులాల తొలగింపుపై వైసీపీ, టీడీపీ స్పందించాలన్నారు.

బీసీలకు జనసేన అండగా ఉంటుందని స్పష్టం చేశారు. చట్టసభల్లో సంఖ్యా బలం లేని బీసీలకు ఏం చేయగలం అనే దానిపై ఆలోచిస్తా... మీ ఓట్లే మీకు పడవు అని బీసీలను హేళన చేస్తున్నారు... బీసీ అభ్యర్థిని నిలబెట్టినప్పుడు అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. నన్ను ఒక కులానికి పరిమితం చేసి బీసీ నాయకులతో తిట్టిస్తున్నారు. నన్ను బీసీలతో తిట్టిస్తే రెండు వర్గాల వారు గ్రామస్థాయిలో ఘర్షణకు దిగుతారు. నేను ఒక కులానికి మాత్రమే నాయకుడిని కాదు. ప్రజలందరికీ నాయకుడిగా ఉండాలనుకుంటున్నా అని పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి బొనబోయిన శ్రీనివాస యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేసన శంకరరావు, క్రాంతి కుమార్, ముత్యాల నాయుడు, కోన తాతారావు, పితాని బాలకృష్ణ, చిల్లపల్లి శ్రీనివాస్, పోతిన మహేష్, నాయకర్, నాగుల్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాయపాటి అరుణ, పోలసపల్లి సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు హోరాహోరీ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నర్సింహారెడ్డి మళ్లీ ప్రచారంలో ముందున్నారు. నర్సింహారెడ్డికి పార్టీల కతీతంగా ఓటర్లు మద్దతు పలుకుతున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 17 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎనిమిది మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇక్కడ కూడా ఎన్నికల ప్రచారం పోటాపోటీగా సాగింది. టీడీపీ తమ పార్టీ అభ్యర్థులున్న చోట రెండో ప్రాధాన్యత ఓటుగా పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చింది. ఇక గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పెద్దసంఖ్యలో పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గాలను కూడా తన ఖాతాలో వేసుకునేందుకు వైసీపీ పెద్దఎత్తున దొంగ ఓట్లను చేర్చడంతోపాటు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడుతోంది. శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి దాదాపు 44 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గాన్ని అధికార పార్టీ ఎలాగైనా గెల్చుకోవాలన్న ధ్యేయంతో ఉత్తరాంధ్ర వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలంతా సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 30 మంది, కడప-అనంతపురం-కర్నూలు గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఇక ఎన్నికల ప్రచారం ముగియడంతో పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. పోలింగ్ సిబ్బందిని బూత్‌ల వారీగా కేటాయింపు ప్రక్రియ కూడా పూర్తి అయింది. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్లు పోలింగ్ స్టేషన్ వద్ద గుర్తింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డు లేదా 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికలు అధికారులు సూచించారు. ఆధార్ కార్డు, ఎంఎన్ఆర్ఇజిఎ జాబ్ కార్డు, బ్యాంక్/ పోస్ట్ ఆఫీసు జారీచేసిన ఫోటో గ్రాఫ్ తో పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ అయిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్ పి ఆర్ కింద ఆర్.జి.ఇ చే జారీ చేయబడిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫోటో గ్రాఫ్ ఉన్న పింఛను డాక్యుమెంట్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ /పి.ఎస్.యు లు/ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు జారీ చేసిన ఫోటోగ్రాఫ్ తో సర్వీసు ఐడెంటిటీ కార్డులు, ఎంపి/ ఎంఎల్ఏ/ ఎంఎల్.సి లకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక అశక్తత గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వినియోగించుకోవచ్చని అధికారులు సూచించారు.

ఇన్‌ఫ్లుయెంజా దెబ్బకు

కోవిడ్ పాజిటివిటీ పైపైకి

- కొన్ని రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు
- వైరస్ వ్యాప్తిపై నిఘా పెంచిన కేంద్రం
- కరోనా నిబంధనలు పాటించాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు
- మందులు, ఆక్సిజన్ అందుబాటులో ఉంచాలని సూచనలు

న్యూదిల్లీ: దేశంలో ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరుగుతుండటం వల్ల కొన్ని రాష్ట్రాల్లో కోవిడ్ పాజిటివిటీ రేటులో క్రమంగా పెరుగుదల నమోదు కావడంపై కేంద్రం శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. శ్వాస సంబంధిత సమస్యలు ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా (ఐఎల్ఐ) లేక తీవ్రమైన దీర్ఘకాలిక శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్ (ఎస్ఏఆర్ఐ) కేసులను నిశితంగా గమనించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రప్రభుత్వం శనివారం ఆదేశాలిచ్చింది. కోవిడ్-19, ఇన్‌ఫ్లుయెంజా కేసులను ఎదుర్కొనేందుకు ఆసుపత్రులు సిద్ధంగా ఉండాలని సూచించింది. అత్యవసర మందులు, మెడికల్ ఆక్సిజన్, వాక్సిన్‌లు సమకూర్చుకోవాలని పేర్కొంది. 'కోవిడ్-19 ట్రాజెక్టరీ కొన్ని నెలలుగా తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రస్తుతం కోవిడ్-19 పాజిటివిటీ రేట్లు కొన్ని రాష్ట్రాల్లో పెరుగుతుండటం ఆందోళనకరం. దీనిని తక్షణమే పరిష్కరించం అత్యవసరం' అని కేంద్ర ఆరోగ్యశాఖ రాజేశ్ భూషణ్ వెల్లడించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు. కోవిడ్ కేసులు, ఆసుపత్రుల పాలయ్యే రోగుల సంఖ్యతో పాటు వాక్సినేషన్ కవరేజిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఐదు అంచెల వ్యూహం 'టెస్ట్, ట్రీట్, వాక్సినేషన్, కోవిడ్ అనుగుణ ప్రవర్తన'పై దృష్టిని కేంద్రీకరించాలని ఆదేశాలిచ్చారు. ఐఎల్ఐ, ఎస్ఏఆర్ఐ కేసులు పెరుగుతున్న క్రమంలో ఇటీవల కేంద్రమంత్రులు, శాఖలు, వ్యవస్థల పెద్దలతో సమీక్షా సమావేశం జరిగింది. ఇన్‌ఫ్లుయెంజా సీజనల్ అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో అది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉండటం కలవరపాటుకు గురిచేస్తుంది. ఈ క్రమంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పారిశుద్ధ్యాన్ని పాటించాలని భూషణ్ సూచించారు. దేశవ్యాప్తంగా ఐఎల్ఐ/ఎస్ఏఆర్ఐ వ్యాప్తి కనిపిస్తోందని రాష్ట్రాలిచ్చిన సమాచారం ఆధారంగా తెలిపారు. వివిధ ల్యాబ్‌లలో పరీక్షించిన నమూనాలలో హెచ్3ఎన్2 'ఇన్‌ఫ్లుయెంజా ఎ' వైరస్‌ను గుర్తించినట్లు వెల్లడించారు. చిన్న పిల్లలు, వయోవృద్ధులు, స్థూలకాయులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు హెచ్1ఎన్1, హెచ్3ఎన్2, అడినోవైరస్‌లు త్వరగా సోకుతాయన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి దేశంలోని వేర్వేరు వైరల్ రీసెర్చ్, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లలో పరీక్షించిన 24.4శాతం నమూనాల్లో అడినోవైరస్‌లను గుర్తించినట్లు భూషణ్ పేర్కొన్నారు. ఇవి సోకినట్లు ఫ్లూ లక్షణాలు ఉంటాయని తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వీటి బారిన పడితే ఆసుపత్రుల్లో చేరాల్సిన పరిస్థితి రావచ్చునని హెచ్చరించారు.

ఫాసిస్టు దాడులు ఆక్షేపణీయం

(మొదటిపేజీ తరువాయి)

ఖండించింది. దోషులను ఉపేక్షించరాదని పేర్కొంది. 'బీజేపీ ఫాసిస్టు దాడి ప్రభావం వెయ్యి మందిపై, వామపక్ష నేతల 20 దుకాణాలపై కనిపించింది. వర్కర్లపై దాడులు జరిగాయి. నిప్పంటించడం, దోచుకోవడం వంటివి చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ముగ్గురు చనిపోయారు. వామపక్ష, కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఎన్నికల హింస బాధితులతో మాట్లాడే క్రమంలో బీజేపీ గూండాలు వారిపై దాడి చేశారు. తద్వారా బీజేపీ ఫాసిస్టు రాజకీయాలు మరింతగా బహిర్గతమయ్యాయి' అని సీపీఐ విమర్శించింది. త్రిపురలోని సెపాహిజాల జిల్లాలోని బిషాల్‌గఢ్ సబ్‌డివిజన్‌లోని సరిహద్దు గ్రామమైన నేహాల్‌చంద్ర నగర్‌లో వామపక్ష, కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధుల బృందంపై బీజేపీ మద్దతుదారులు దాడికి పాల్పడటం ఆక్షేపణీయమని పేర్కొంది. బృంద సభ్యుల్లో సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం, పార్టీ జాతీయ కార్యదర్శి ఇల్మారం కరీం, సీపీఎం ఎంపీలు పీఆర్ నటరాజ్, వికాశ్ రంజన్ భట్టాచార్య, ఏఏ రహీం ఉన్నారు. వీరంతా త్రిపుర మాజీ సీఎం, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్‌తో కలిసి ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసపై ఆరా తీసేందుకు వెళ్లినట్లు తెలిపింది.

త్రిపురలో బీజేపీ 'తాలిబన్ రాజ్'

(మొదటిపేజీ తరువాయి)

మోహరించినట్లు చెప్పారు. ఎంపీల వాహనాలపై దుండగులు రాళ్లు రువ్వారని, దీంతో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. నాయకులు ఎస్కార్ట్ పోలీసుల సాయంతో అక్కడ నుంచి వెళ్లిపోయారని, వారిలో ఎవరికీ గాయాలు కాలేదని, వాహనాలు మాత్రమే ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. అటు మోహన్‌పూర్‌ను సందర్శించిన పార్లమెంటరీ సభ్యులపైనా బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు.

చట్టసభల్లో త్రిపురపై గళమెత్తుతాం: మాపై దాడి ఆక్షేపణీయం

బీజేపీ పాలిత త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింస, దానిపై విచారణకు వెళ్లి బాధితులను కలిసే ప్రయత్నం చేసిన తమపై కషాయ మూకలు దాడులు చేయడాన్ని వామపక్ష, కాంగ్రెస్ ప్రతినిధుల బృంద సభ్యులు తీవ్రంగా ఖండించారు. త్రిపురలో హింసపై పార్లమెంటులో గళమెత్తుతామని తేల్చిచెప్పారు. విలేకరుల సమావేశంలో సీపీఐ ఎంపీ ఇల్మారం కరీం మాట్లాడుతూ 'బీజేపీ-ఆర్ఎస్ఎస్ గూండాలు కేవలం రాష్ట్ర ప్రజలపై దాడులు చేయడమే కాకుండా వారి జీవనోపాధినీ నాశనం చేశారు. ఫలితంగా అనేకమంది ఇల్లు-వాకిళ్లు వదిలి వలసబాట పట్టారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులను గవర్నర్ సత్యదేవ్ నరేన్ ఆర్య దృష్టికి నిజనిర్ధారణ ప్రతినిధి బృందం తీసుకెళ్లింది. దీనిని పరిశీలిస్తానని, తగు చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీనిచ్చారు' అని అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో త్రిపురలో ఎన్నికల అనంతరం జరిగిన హింసపై గళమెత్తుతామని చెప్పారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ త్రిపురలో బీజేపీ 'తాలిబన్ రాజ్' సాగుతోందని విమర్శించారు. త్రిపురలో ఎంపీల బృందంపై దాడి జరిగితే ప్రధానిగానీ హోంమంత్రిగానీ నోరు విప్పలేదని, ఇది పార్లమెంటుకు అవమానమని ఆయన నొక్కిచెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి మాట్లాడుతూ వెయ్యికిపైగా హింసాత్మక ఘటనలు ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగాయని అన్నారు. కాంగ్రెస్ త్రిపుర అధ్యక్షుడు బిరజిత్ సిన్హా మాట్లాడుతూ, మూకలను అదుపు చేయకుంటే రాష్ట్రంలో పౌర యుద్ధం తరహా పరిస్థితి నెలకొనవచ్చన్నారు. సమావేశంలో సీపీఎం ఎంపీ వికాశ్ రంజన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఖండన: వామపక్ష, కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధుల బృందంపై దాడిని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్ మాధ్యమంగా ఖండించారు. భద్రత కల్పించాల్సిన పోలీసులు ఏమీ చేయలేకపోయారని వ్యాఖ్యానించారు. బీజేపీ పురిగొల్పిన హింస విజయం సాధించిందని, దీనిపై అక్కడ విజయోత్సవ ర్యాలీని బీజేపీ నిర్వహిస్తుందని ఆయన దుయ్యబట్టారు.

ఇదంతా కుట్ర: బీజేపీ

వామపక్ష, కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధుల బృందంపై దాడి వెనుక పెద్ద కుట్రే ఉందని బీజేపీ అధికార ప్రతినిధి నబేందు భట్టాచార్య ఆరోపించారు. బీజేపీని జాతీయ స్థాయిలో అవమానించేందుకు లెఫ్ట్, కాంగ్రెస్ యత్నిస్తోందని అన్నారు. దిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా... డీజీపీతో మాట్లాడారు. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. పార్టీ సీనియర్లు స్థానిక యంత్రాంగాలతో దీనిపై చర్చించారు' అని భట్టాచార్య అన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-నంద్యాల రూరల్: సమస్యల పరిష్కారానికి, శాసనమండలిలో ప్రజావాణిని వినిపించాలంటే ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రెంట్ (పీడీఎఫ్) అభ్యర్థులైన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, బలపరిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ కోరారు. శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో స్థానిక సీపీఐ కార్యాలయంలో ఉపాధ్యాయులు, సీపీఐ ప్రజాసంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఎస్టీయూ జిల్లా నాయకులు సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సోమవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ప్రజాసంఘాలు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులైన కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మన అందరిపై ఉన్నదని వారన్నారు. ప్రధానంగా ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా, రాయలసీమ జిల్లాల్లో సమగ్రాభివృద్ధి జరగాలన్న కత్తి నరసింహారెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని సూచించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అజం బేగ్, మౌలాలీ ప్రసంగించారు. మేధావులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఆయా రంగాలకు చెందిన ఉద్యోగస్తులు మరియు పట్టభద్రులు, కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురామమూర్తి, రాధాకృష్ణ, సీపీఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్, డోన్ మండల పార్టీ కార్యదర్శి పులి శేఖర్, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ, ఆయా మండలాలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీలపై విద్యుత్ భారం వేయొద్దు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పంచాయతీలకు నిధులివ్వకుండా ఎండగట్టడమేకాకుండా ఉన్న నిధులను కూడా విద్యుత్ బిల్లులకు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల జారీచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, ఇప్పటికే దారి మళ్లించిన నిధులను కూడా పంచాయతీలకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలకు చెందాల్సిన 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.1244 కోట్లను మినహాయించుకుంది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోవడమే కాక చిన్నపాటి పనులు కూడా చేయలేని దుస్థితిలోకి పంచాయతీలు వెళ్లాయి. దీనిపై సర్పంచులు కొద్దికాలంగా ఆందోళనలు చేస్తున్నా వారి అభిప్రాయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకపోవడం సరైంది కాదు. పైగా ఉన్న కొద్దిపాటి నిధులనూ విద్యుత్ బకాయిల కింద జమచేయాలని ఆదేశించడం గర్హనీయం. ఆర్థిక సంఘం నిధులు ఇచ్చేందుకు సర్పంచులు అంగీకరించకపోవడంతో ఏ నిధులు ఉంటే ఆ నిధులు చెల్లించాలని ఉత్తర్వులు ఇవ్వడం పంచాయతీల పీక నులమడం తప్ప మరొకటి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చెక్‌పవర్ ఉన్న ఏకైక ప్రజాప్రతినిధి సర్పంచి మాత్రమే. వారి హక్కులనూ కాలరాయడం ఏ మాత్రమూ సమంజసం కాదు. నిధుల వినియోగానికి సర్పంచుల సంతకం తప్పనిసరి కావడంతో వారిని పక్కనబెట్టి అధికారుల ద్వారా వ్యవహారం నడిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలి. ఇప్పటికే జమచేసుకున్న నిధులను తిరిగి పంచాయతీలకు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 13వ తేదీ జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్‌మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు కొంతమంది ప్రధా నోపా ధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు అనేక ఆంక్షలు, ఇబ్బందులు పెడు తున్నట్లుగా ఫ్యాప్టో దృష్టికి వచ్చిందని తెలిపారు. ఉపాధ్యాయులను స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎలక్షన్ కమిషన్ ఈనెల 13వ తేదీ ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేసిందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సంబంధించి ప్రత్యేక క్యాజువల్ సెలవు మంజూరు చేసినట్లుగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కూడా ఉత్తర్వులు జారీ చేశారని, కావున ఈ విషయంలో ఎటువంటి వివాదాలకు తావు లేదని పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారికి లేఖ కూడా రాశామని వారు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రత్యేక క్యాజువల్ సెలవు ఉపయోగించుకుని వారి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వారు ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- 15 నుంచి ఏప్రిల్ 4వరకు నిర్వహణ
- 1489 పరీక్షా కేంద్రాలు
- 10,03,674 విద్యార్థులు
- పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే ఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచడంతోపాటు తగిన ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, సుమారు 25 పరీక్షా కేంద్రాలకు కలిపి ఒక 108 అంబులెన్సు సేవలను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆయా రూట్లలో తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరీక్షలు జరిగే సమయంలో ప్రశ్నాపత్రాలు లీకేజీ లేదా మాల్ ప్రాక్టీస్ వంటి వదంతులు సృష్టించి విద్యార్థులను ఆందోళనలకు గురిచేసే ప్రయత్నాలు జరుగు తుంటాయని, అలాంటివి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూములు ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల పరిధిలో పరీక్షలు జరిగే తేదీల్లో జిరాక్సు కేంద్రాలు/ఫొటో కాపీయింగ్ కేంద్రాలను మూయించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తగినన్ని మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఇందుకుగాను ప్రత్యేకంగా ఒక నోడలు అధికారిని నియమించి ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎస్ సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల 3వేల 674 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వారిలో 4 లక్షల 84 వేల 12 మంది మొదటి సంవత్సరం పరీక్షలకు, 5 లక్షల 19 వేల 662 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు సీఎస్‌కు వివరించారు. ఇందుకోసం మొత్తం 1489 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12గం.ల వరకూ జరుగుతాయని వివరించారు. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేశ్ కుమార్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు పాల్గొన్నారు.

ఏపీకి భారీ ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సంవత్సరం చివరి నెలలో భారీ ఊరట లభించింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ఇంకా జీతాలు కూడా చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో పన్నుల వాటా కింద కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదలయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్చి చివరి మాసం కావడంతో ప్రభుత్వంపై ఇతరత్రా చెల్లింపుల భారం కూడా అధికంగా ఉంది. దీనికితోడు ఉద్యోగులకు ఈ నెలాఖరులోగా రూ.3 వేల కోట్ల బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. మరోపక్క ఈనెల 14 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ఈలోగా ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు చెల్లింపులు పూర్తికాని పక్షంలో ప్రతిపక్షం అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏపీకి రావాల్సిన పన్నుల వాటా రెండు వాయిదాలను కేంద్ర ప్రభుత్వం ఒకేసారి విడుదల చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ఆర్థిక వెసులుబాటు కలిగించింది. నీతి అయోగ్ సిఫార్సుల మేరకు రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటాలో 41 శాతం చెల్లించాల్సి ఉంది. అందులో భాగంగా కేంద్రం తాజాగా రాష్ట్రాల పన్నుల వాటా కింద రూ.1,40,318 కోట్లు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.5,474 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి రూ.2,682 కోట్లు వాటాగా విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.

'దశ'తో అందరికీ న్యాయం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలోని పేద, ధనిక, కుల, మత అనే తేడాలు లేకుండా ఎటువంటి సమస్య ఉన్నా దశ మొబైల్ యాప్‌కు సమాచారం వచ్చిన వెంటనే గంటల వ్యవధిలోనే న్యాయాన్ని బాధితుని ఇంటి ముందుకు తీసుకువస్తామని జై భీమ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ తెలిపారు. జై భీమ్ పార్టీ అధ్వర్యంలో రూపొందించిన 'న్యాయం కోసం నేను సైతం, దశ మొబైల్ యాప్ ఆవిష్కరణ" సభ శనివారం గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన వారి చేతులమీదుగా యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ తయారు చేయడానికి పేద ప్రజల మీద ఉన్న ప్రేమ ఈ రోజు వచ్చింది కాదనీ, అత్యున్నత వ్యవస్థ ఏదన్నా ఉంది అంటే న్యాయ వ్యవస్థ మాత్రమేనని శ్రవణ్ అన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రజలు సంతోషంగా ఉన్నారంటే అది న్యాయ వ్యవస్థ. రాజ్యాంగ రాసిచ్చిన బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఈ యాప్ తయారు చేశానని ఆయన తెలిపారు. ఈ దేశంలో రెండు శాతం మాత్రమే న్యాయం జరుగుతోందనీ, 98శాతం న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలను ఒక్కటే చెబుతున్నాననీ, వైసీపీ ప్రభుత్వాన్నిన ఓడించాలని, జనసేన పార్టీకి ఒక్క సీటు రాకుండా చేయాలని పిలుపునిచ్చారు. ఎప్పటికైనా జై భీమ్ పార్టీ ప్రభుత్వాన్ని కచ్చితంగా నెలకొల్పుతామన్న విశ్వాసం ఉందన్నారు. మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో దుర్మార్గం నడుస్తోందన్నారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు బాల కోటయ్య మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు మన మీద ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు, దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, డా॥ సుధాకర్ నీ మాస్కు అడిగినా పాపానికి ఈ ప్రభుత్వం దారుణంగా చంపేసిందన్నారు. ఈ సభలో ఏపీ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు చెవుల కృష్ణాంజనేయులు, నేతి మహేశ్వరరావు, బాపట్ల అభ్యర్థి పెరుమాళ్ల సుబ్బారావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర-రాప్తాడు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి పోటీలో పాల్గొనాలని సాఫ్ట్‌బాల్ ఇండియా సీఈఓ ప్రవీణ్ అనోకర్ సూచించారు. అనంతపురం ఆర్డీటీ క్రీడామైదానంలో ఆల్ ఇండియా సీనియర్ ఇంటర్ జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల, మహిళల పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు దేశంలోని సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్ జోన్ల నుంచి నాలుగు పురుషుల, నాలుగు మహిళల జట్లు పాల్గొం టున్నాయి. పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథులుగా ఆర్డీటీ తిప్పేస్వామి, సాఫ్ట్‌బాల్ ఇండియా ట్రెజరర్ శ్రీకాంత్ తోరాట్, సాఫ్ట్‌బాల్ ఏపీ సీఈఓ సి.వెంకటేశులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సాఫ్ట్‌బాల్ ఏపీ సీఈఓ సి.వెంకటేశులు మాట్లాడుతూ, ఆర్డీటీలో అంతర్జాతీయ క్రీడా సదుపాయాలు ఉన్నందున సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా యాజమాన్యం జాతీయ టోర్నమెంట్‌లను మనకు ఇస్తున్నారని, ఆర్డీటీలో ఉత్తమ సదుపాయాలు కల్పించిన ప్రోగ్రాం డైరెక్టర్ మాంచా ఫెర్రర్‌కు రుణపడి ఉంటామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారం, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఏపీలో ఈ క్రీడ ఎంతో ప్రాచుర్యం పొందుతోందన్నారు. ప్రవీణ్ అనోకర్ మాట్లాడుతూ అనతి కాలంలోనే ఏపీలో సాఫ్ట్‌బాల్ క్రీడ అభివృద్ధి చెందుతూ ఎంతో మంది గ్రామీణ క్రీడాకారులను మెరికల్లా తీర్చిదిద్దుతోందన్నారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో పురుషుల పోటీల్లో సౌత్‌జోన్, నార్త్‌జోన్ పై 03-00 తేడాతో గెలవగా, వెస్ట్ జోన్, ఈస్ట్ జోన్ పై 10-00 తేడాతో గెలిచింది. అదేవిధంగా పురుషుల సౌత్‌జోన్, నార్త్ జోన్ పై 07-00 తేడాతో గెలిచింది. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్, డీఎస్‌డీఏ చైర్మన్ రమణ, సాఫ్ట్‌బాల్ ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు శశిభూషణ్, సి.నాగేంద్ర, తెలంగాణ సెక్రటరీ శోభన్, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, గ్రాస్ రూట్ కో-ఆర్డినేటర్ ఓబులేసు, రిటైర్డ్ పీఈటీ కొండారెడ్డి, ఏపీఎస్ఏపీఈ గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, పీడీలు రామకృష్ణ, పక్కీరప్ప, కేశవమూర్తి, గోపాల్ రెడ్డి లతాదేవి, ప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు బద్రి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రమేశ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు రమేష్ హాస్పిటల్‌లో అత్యంత అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు రమేశ్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. హాస్పటల్ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరుకు చెందిన వాసిరెడ్డి సుజాత అనే 69 సంవత్సరాల మహిళ వారి కుటుంబ సభ్యుల ఫంక్షన్‌కు హాజరయ్యారని, భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా కుర్చీలో నుంచి కింద పడిపోయి స్పృహ కోల్పోయారన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు రమేశ్ హాస్పిటల్స్‌కు తీసుకురాగా మెదడుకు వెళ్లే రక్తనాళాల (కెరొటిడ్ ఆర్టరీ) పరీక్షలైన కెరొటిడ్ డాప్లర్, ఎంఆర్ఐ బ్రెయిన్ యాంజియో, సీటీ బ్రెయిన్ అండ్ నెక్ యాంజియో నిర్వహించగా ఎడమవైపు ఉండే మెదడుకు రక్తాన్ని తీసుకువెళ్లే ధమనిలో 90 శాతానికిపైగా పూడిక ఉండటాన్ని నిర్ధారించినట్లు చెప్పారు. సాధారణంగా ఇటువంటి కేసుల్లో క్యాతల్యాబ్‌లో యాంజియో ప్లాస్టీ ద్వారా చికిత్స చేస్తూ ఉంటారని, కానీ ఈ మహిళ మెదడుకు తీసుకువెళ్లే ధమనిలో పూర్తిగా క్యాల్షియం పేరుకుపోయి ఉండడంతో సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ హరిత, డాక్టర్ రామారావు, సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ జయరాం పాయ్, చీఫ్ న్యూరాలజిస్ట్ మేజర్ జనరల్ రిటైర్డ్ డాక్టర్ కుమార్ వేలు, సీనియర్ మత్తు వైద్య నిపుణులు డాక్టర్ బికాస్ సాహూలతో కూడిన వైద్య బృందం ఏకైక ప్రత్యామ్నాయంగా కెరొటిడ్ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించిందన్నారు. సాధారణంగా గుండెకి వెళ్లే రక్తనాళాలకు, పొట్ట, కాళ్లు, చేతులలో ఉన్న రక్త నాళాలకు బైపాస్ సర్జరీ నిర్వహిస్తుంటారని, కానీ అత్యంత క్లిష్టమైన మెదడుకు వెళ్లే రక్తనాళాలకు బైపాస్ సర్జరీ నిర్వహించడం చాలా అరుదుగా జరుగుతుందని సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ జయరాం పాయ్ తెలియజేశారు. శస్త్ర చికిత్స విజయవంతమైందని రోగి 3వ రోజు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. వ్యాధిని నిర్ధారించడం, అరుదైన అత్యంత క్లిష్టమైన కెరొటిడ్ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ చికిత్సను విజయవంతంగా నిర్వహించినందుకు వైద్య బృందాన్ని డాక్టర్ రమేశ్ బాబు అభినందించారు. సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ హరిత, డాక్టర్ రామారావు, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కుమార్ వేలు, చీఫ్ ఎనస్థటిస్ట్ డాక్టర్ బికాస్ సాహూ, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమతా రాయపాటి, బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

మంచి వ్యక్తికి ఓటెయ్యండి: బండారు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విద్యావంతులైన పట్టభద్రులంతా రాజకీయాలు పక్కన పెట్టి, ప్రలోభాలకు గురికాకుండా మంచి వ్యక్తికి ఓటు వేయాలని టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. అధికారులే చట్టాలను కాలరాయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా పేర్కొన్నారు. విశాఖలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనమండలిలో మంచి వ్యక్తులు ఉండాలని, గతంలో ఎంతోమంది మంచి వారు ఎన్నికయ్యారని, వైసీపీ నేతను పంపిస్తే మళ్లీ బురదలో ఉన్నట్టేనన్నారు. ఉపాధ్యాయులను బెదిరింపులకు గురి చేస్తారా? అని ప్రశ్నించారు. జిల్లా యంత్రాంగం పై తమకు నమ్మకం లేదన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి మాట్లాడుతూ మొదటిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నానని, ఉద్యోగుల సమస్యలు విద్యార్థుల సమస్యలు అన్ని తెలిసిన వాడినన్నారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు చట్టాలు కాలరాస్తే ప్రజా వ్యవస్థ పరిరక్షణ ఎవరు చేస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ప్రలోభాలు పెడుతుందని, శుక్రవారం రాత్రి ఓటర్ల కోసం వెండి బిస్కెట్లు ఇస్తున్నారన్నారు. ఈ సమాచారం మాకు వైసీపీ నేతలే ఇచ్చారని, వైసీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను ఎన్నికల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ 101 ఫ్లాట్‌లో సీతంరాజు సుధాకర్ ఇంట్లో వేల వెండి నాణేలు ఉన్నాయని, మేము చూశామన్నారు. దీనిపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని, అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. టీడీపీ సీనియర్ నేత భరత్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పాసర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బండి'పై మహిళా కమిషన్ సీరియస్

- సుమోటోగా కేసు
- విచారణ జరపాలని డీజీపీకి ఆదేశం
- బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత

విశాలాంధ్ర-హైదరాబాద్: ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో ఈడీ నోటీసు అందుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శలు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళల గౌరవాన్ని కించపరిచేలా సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడింది. ఈ మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసి.. వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించనున్నట్లు సమాచారం. సంజయ్ వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించిన కమిషన్, ఆ వ్యాఖ్యలపై విచారణ జరపాలని డీజీపికి ఆదేశించింది. మరోవైపు కవిత ఈడీ విచారణకు హాజరైన నేపథ్యంలో ఆమెకు మద్దతుగా నగరంలోని అనేకచోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు, నేతలు అనేకచోట్ల దిష్టి బొమ్మలు దహనం చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్వర్యంలో పంజాగుట్ట చౌరస్తాలో ఆందోళనకు దిగారు. వెంటనే సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని, కవితకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కవిత విచారణ, నగరంలో బీఆర్ఎస్ ఆందోళనల దృష్ట్యా నగరంలోని బషీర్‌బాగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి తాళాలు వేసి, పోలీసులు భారీగా మోహరించారు.

ఈడీ కార్యాలయం వద్ద ఆందోళన

ఈడీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. ఆ పార్టీ నాయకుడు ఆశిష్ యాదవ్ అధ్వర్యంలో కార్యాలయం ముందు బైఠాయించిన శ్రేణులు.. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్, ఇతర నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని, తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పకపోతే బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్, పంజాగుట్ట, ఎస్సార్‌నగర్, ముషీరాబాద్, వనస్థలిపురం, కూకట్‌పల్లి ఠాణాలతో పాటు అనేక పోలీస్ స్టేషన్లలో బండి సంజయ్‌పై ఒకే తరహా ఫిర్యాదులు రావడంతో పోలీసులు న్యాయ సలహా తీసుకుంటున్నారు. ఫిర్యాదులన్నీ ఏదైనా ఒక పీఎస్‌కు బదిలీ చేసి, దర్యాప్తు చేసే యోచనలో పోలీసు ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం.

గవర్నర్ అపాయింట్‌మెంట్‌పై రభస

ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మేయర్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. మహిళా నేతలంతా రాజ్‌భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రిక్తత నెలకొంది. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు అడిగిన వెంటనే అపాయింట్‌మెంట్ ఇస్తున్న గవర్నర్, తమకు ఎందుకు ఇవ్వరని మేయర్ విజయలక్ష్మి ప్రశ్నించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్ స్పందించాలని కోరారు. ఎమ్మెల్సీ కవితకే కాదు, మొత్తం మహిళా లోకానికే బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు. మహిళా నేతలు భారీగా చేరుకోవడంతో వారిని కట్టడి చేసేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. ఒక దశలో మహిళలు రాజ్‌భవన్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. గవర్నర్ అపాయింటమెంట్ ఉంటేనే లోపలికి అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో.. వినతిపత్రాలను బారికేడ్లకు అంటించి నిరసన తెలిపారు.

నోటీసు వస్తే... స్పందిస్తా: సంజయ్

సంజయ్ వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించిన కమిషన్, విచారణ జరపాలని డీజీపీని ఆదేశించింది. ఈ మేరకు బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేసి, వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. తనకు ఇంకా మహిళా కమిషన్ నుంచి నోటీసులు అందలేదన్నారు. ఒకవేళ నోటీసులు వస్తే.. తప్పకుండా కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతానని ప్రకటించారు. మరోవైపు బీఆర్ఎస్ నేతల ఆందోళనల నేపథ్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. కార్యాలయానికి వచ్చే రెండుదారుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు.

37,750 గ్రాముల వెండి స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఎన్నికల సందర్భంగా పోలీసుల తనిఖీల్లో ఆర్టీసీలో అక్రమంగా రవాణా చేస్తున్న 37.750 గ్రామాల వెండిని శనివారం తెల్లవారు జామున పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. నగరంలోని 4వ పట్టణ పోలీసుస్టేషన్ సీఐ శంకరయ్య అధ్వర్యంలో తెల్లవారు జామున కల్లూర్ మండలం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలో తమిళనాడులోని, సేలంటౌన్‌కు చెందిన కుమార్ జ్యూయల్లర్స్ షాప్‌లో గుమస్తాగా పని చేసే తమిళనాడు రాష్ట్రం, తిరుచిరాపల్లి టౌన్‌కు చెందిన బాబు అనే వ్యక్తి వారి యజమాని ఎన్‌జీ కుమార్ ఆదేశాల మేరకు కర్నూల్, నంద్యాల జిల్లాలలో బంగారు షాప్‌లకు ఎలాంటి ప్రభుత్వ బిల్లులు లేకుండా 37.750 కేజీల వెండి పట్టీలను ప్లాస్టిక్ కవర్లలో ఉంచుకొని, వాటిని రెండు హ్యాండ్ బ్యాగ్‌లలో పెట్టుకొని బస్సులో వచ్చాడు. బస్సు బస్టాండ్‌లో ఉండగా అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వెండి విలువ సుమారు రూ.25,00,000/- విలువ ఉంటుందన్నారు. పట్టీలను సీజ్ చేసినట్లు వివరించారు.

సంపాదకీయం

అవినీతికి మోదీ కొత్త భాష్యం

దివారాత్రాలు పని చేసేది ప్రధానమంత్రి మోదీ ఒక్కరే కారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలైన, సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ తో పాటు ఆదాయపు పన్ను శాఖ కూడా నిరంతరం పని చేస్తూనే ఉంది. ఈ సంస్థలు ఏం పని చేయాలో మోదీ సర్కారు చాలా స్పష్టంగా గిరిగీసి చూపించి నట్టుంది. ఈ సంస్థలకు ప్రతిపక్ష నాయకులలోనే అవినీతి కనిపిస్తుంది. ప్రతిపక్షంలో ఉన్న పలుకుబడిగల ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకులూ ఈ కేంద్ర సంస్థల కోరలనుంచి తప్పించుకునే అవకాశం లేదు. అందరి జాతకాలూ తన దగ్గర ఉన్నాయని మోదీ 2017లోనే ప్రకటించారు. ఈ సంస్థల దాడి నుంచి తప్పించుకోవడానికీ, ఆత్మ రక్షణకు బీజేపీలో చేరిన నేతలకు మాత్రమే రక్షణ ఉంది. అలాంటి వారి మీద అంతకు ముందు ఎన్ని తీవ్రమైన ఆరోపణలు వచ్చినా వారు బీజేపీలో చేరడంతోనే పునీతులైపోతున్నారు. అధికారాన్ని పదిల పరచుకోవడానికి బీజేపీ సర్కారు కేవలం ప్రభుత్వ యంత్రాంగాన్ని మాత్రమే వినియోగించుకోవడం లేదు. తమ అధీనంలో ఉన్న దర్యాప్తు సంస్థలన్నింటినీ రంగంలోకి దింపింది. ఈ సంస్థలన్నీ మోదీ సర్కారు అధికారాన్ని పదిలపరచవలసిన బాధ్యతను నిర్వర్తిస్తున్నట్టు కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలను వినియోగించి ప్రతిపక్ష నాయకులందరినీ అవినీతిపరులని ప్రచారం చేసి లబ్ధి పొందడమే బీజేపీ లక్ష్యంగా మారింది. ఎక్కడైనా ఎన్నికలు జరగవలసినప్పుడే ఈ సంస్థలను రంగంలోకి దింపడం అనే ఆనవాయితీ కూడా మారిపోయింది. ఆ సంస్థల అధికారులు నిద్రాహారాలు మాని దాడులు కొనసాగించవలసిన స్థితిలో ఉన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడానికి మాత్రమే మోదీ సర్కారు పరిమితం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సకల వ్యవస్థలనూ వినియోగించి ప్రతిపక్ష నాయకులందరూ అవినీతి పరులేనని నమ్మించడానికి ప్రయత్నిస్తోంది. అలాగని ఈ దాడులకు గురవుతున్న నాయకులందరూ కడిగిన ముత్యాల్లాంటి వారని వాదించడం కాదు. బీజేపీ నాయకులు, లేదా ఆరోపణల దెబ్బకు తాళలేక బీజేపీలో చేరిన నేతలు తప్ప మిగతా వారందరూ కళంకితులేనని మోదీ సర్కారు నిరూపించదలచుకుంది. అంటే బీజేపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని, కేంద్ర వ్యవస్థలను ప్రతిపక్షాలను అణచి వేయడానికి పదునైన ఆయుధాలుగా వినియోగించుకుంటోంది. 2016 లోనే ప్రతిపక్షాలకు నిధులు అందకుండా మోదీ కట్టుదిట్టం చేశారు. అప్పటి నుంచే రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు నిత్యకృత్యమైపోయాయి. ఎన్నికల్లో గెలవడానికి ఈ వ్యవస్థలను మోదీ వాటంగా ఉపయోగించుకుంటున్నారు. ధన దుర్వినియోగ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు ప్రతిపక్ష నాయకుల మీద మోపు తున్నారు. గత దశాబ్ద కాలంలో ఈ చట్టం కింద 1569 కేసులు మోపితే కేవలం తొమ్మిది సందర్భాలలో మాత్రమే ఆరోపణలు ఎదుర్కున్న వారికి శిక్ష పడింది. అంటే ఎక్కువ భాగం కక్ష సాధించడానికే దాడులు జరిగాయి.

కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మీద వ్యక్తి గత అవినీతి ఆరోపణలు లేకపోయినా నేషనల్ హెరాల్డ్ పత్రిక నిధులను దిర్వినియోగం చేశారని కేంద్ర దర్యాప్తు సంస్థలు గంటల తరబడి ప్రశ్నించాయి. అయితే వీరి మీద ఇప్పటిదాకా ఒక్క కేసైనా దాఖలు చేయలేదు. అవసరమైనప్పుడు ఇదివరకు మూసేసిన కేసులను మళ్లీ తెరుస్తున్నారు. లాలూ ప్రసాద్ మీద దాడి ఇలాంటిదే. లాలూ కుటుంబం మొత్తం దర్యాప్తు సంస్థల దాడులను ఎదుర్కుంటూనే ఉంది. లాలూ సతీమణి రబ్డీ దేవి, కొడుకు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, లాలూ కూతుర్లు కూడా ఈ దాడులకు గురయ్యారు. ఇంకా గురవుతూనే ఉన్నారు. తాజాగా రబ్డీ దేవి మీద, దిల్లీలోని తేజస్వి ఇంటి మీద దాడులు జరిగాయి. తేజస్వి మీద మొదటి సారి దాడి జరిగినప్పుడే ఆయన కేంద్ర దర్యాప్తు సంస్థల వారు మళ్లీ వస్తారు అని జోస్యం చెప్పారు. ఆ జోస్యం నిజమైంది. తాము భయానకమైన ఎమర్జెన్సీ రోజులను చూసిన వాళ్లం అని తీవ్ర అనారోగ్యంతో తీసుకుంటున్న లాలూ సవాలు విసురుతున్నారు. తన భార్య, కూతుళ్లు, కొడుకుల మీద దాడులు కొనసాగించినా భయపడేది లేదని లాలూ ప్రతిజ్ఞ చేశారు. బీజేపీతో తనది సైద్ధాంతిక పోరాటం అని అది కొనసాగుతూనే ఉంటుందని లాలూ స్పష్టం చేశారు. లాలూ కుటుంబాన్ని వేధిస్తు న్నందుకు ఆర్.జె.డి. కార్యకర్తలలో ఆగ్రహం కుతకుత ఉడుకుతోంది. వారు వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. లాలూతో బీజేపీ వైరం ఈ నాటిది కాదు. అద్వాణీ రథ యాత్ర బిహార్ లో ప్రవేశించగానే ఆ రథ యాత్రను అడ్డుకున్న చరిత్ర లాలూకు ఉంది. అంతకు ముందు అద్వాణీ రథ యాత్ర కొనసాగిన చోటల్లా మతకలహాలు జరిగి కనీసం 3,000 ప్రాణాలు గాలిలో కలిశాయి. ఇంతవరకు బీజేపీతో ఏ దశలోనూ చేయి కలపకుండా ఉన్నది ఆర్.జె.డి.ఒక్కటే . తమ తండ్రికి ఏమైనా అయితే ఒక్కరినీ వదిలి పెట్టబోనని లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య అంటున్నారు. వెయ్యి సార్లు దాడి చేసినా తాము లొంగేది, భయపడేది లేదని రబ్డీ దేవి చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేంద్ర జైన్ కొన్ని నెలలుగా జైలులోనే ఉన్నారు. ఆయనకు బెయిలు కూడా రావడం లేదు. తాజాగా దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు. ఆయన మీద కేసుల మీద కేసులు మోపుతున్నారు. దిల్లీ మద్యం విధానం కుంభకోణంలోనే భారత రాష్ట్ర సమితి (మునుపటి టి.ఆర్.ఎస్.) నాయకురాలు కవితను దిల్లీ పిలిపించి విచారి స్తున్నారు. అవినీతిని నిర్మూలించడమే తన అంతిమ లక్ష్యం అని ప్రకటించిన మోదీకి బీజేపీ నాయకుల మీద, తన ప్రభుత్వం మీద వచ్చిన అవినీతి ఆరోపణలు మాత్రం కనిపించవు. పైగా ఆర్థిక నేరస్థులను వెనకేసుకురావడమే ఆయన లక్ష్యంలా ఉంది. ఉదాహరణకు 2014లో సుప్రీంకోర్టు 204 బొగ్గు గనుల కేటాయిం పులను రద్దు చేసింది. అందులో అదానీకి చెందిన పి.ఇ.కె.బి., పర్సా సంస్థలూ ఉన్నాయి. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిబంధనలు మార్చి మళ్లీ ఆ రెండు సంస్థలకు బొగ్గు గనులు కట్టబెట్టి తాను ఎవరి అవినీతిని సహిస్తారో మోదీ రుజువు చేసుకున్నారు. మేఘాలయలో ఇప్పుడు వరసగా రెండో సారి విజయం సాధించిన కోన్రాడ్ సంగ్మా ప్రభుత్వం అంత అవినీతికరమైంది దేశంలోనే లేదు అని ఎన్నికల ప్రచారంలో చెప్పిన మోదీ అక్కడ తమ పార్టీకి దక్కింది రెండు స్థానాలే అయినా అధికారంలో వాటా కోసం కోన్రాడ్ సంగ్మా ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారాలకు హాజరు కావడం మోదీ పెట్టిన కొత్త ఒరవడి.

త్రిపురలో బీజేపీ హింసాకాండ

వినయ్ విశ్వం

ఎన్నికలు కాగానే త్రిపుర మళ్లీ కల్లోలంలో పడిపోయింది. ఈశాన్యరాష్ట్రం త్రిపురలో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేయ వలసిందేమిటో ఆలోచించి పెట్టుకున్న బీజేపీ సాగించిన దమనకాండను అమాయకప్రజలు అనుభవిస్తున్నారు. ఎన్నికల ప్రచారం సమయంలో స్వల్పకాలం ప్రశాంతంగా ఉండవచ్చునని ప్రజలు ఆశించారు. ఎన్నికల వ్యూహంలో భాగంగా తాత్కాలికంగా అయినా బీజేపీ హింసా రాజకీయాలకు విరామం ఇస్తుందని రాష్ట్ర ప్రజలు ఆశించారు. తామేదో గొప్ప విజయాలు సాధించామని బూటకపు ప్రచారం సాగించిన బీజేపీ నాయకులు రాష్ట్రంలో ప్రశాంతత నెలకొల్పుతామని నమ్మబలికారు. ప్రజలను మోసగించడానికి వేసిన ఎత్తుగడే ఈ ప్రచారం. ఎన్నికల క్రమంలో హింసాకాండ సాగించే పార్టీకి బీజేపీ ప్రతీక. తాజా ఫలితాలు వెల్లడికాగానే ప్రజలపై ప్రతీకారం తీర్చుకొనేందుకు ఆర్ఎస్ఎస్-బీజేపీ శక్తులు పెద్దఎత్తున ఏనాడూ లేనంతగా హింసాకాండ సాగించాయి.

బీజేపీలో పెద్ద తలకాయలైన మోదీ-షా ద్వయం మెజారిటీ వాదాన్ని ప్రజలపైన రుద్ది రెండోసారి పాలనను ప్రారంభించారు. భుజబలం ఉపయోగించారు. విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. గెలుపే లక్ష్యంగా అన్ని అక్రమ మార్గాలు అనుసరించారు. రాష్ట్రంలో అనేకమంది కేంద్ర మంత్రులు ఇక్కడే తిష్టవేసి ప్రజలను అనేక విధాలుగా మభ్యపెట్టారు. ఎట్టకేలకు తక్కువ మెజారిటీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో గెలిచిన సీట్లకంటే ఈ సారి పదకొండు తగ్గాయి. పదిశాతం ఓట్లు కొల్పోయారు. మొత్తం 60 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరిగాయి. ఇలాంటి సందర్భంలో ప్రజలపై దాడులు సాగించాలని తన కార్యకర్తలకు ఆర్ఎస్ఎస్ బోధిస్తుంది. ఈ సంస్థ భావజాలమే ఇది. ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఆర్ఎస్ఎస్-బీజేపీ శక్తులు ప్రజలకు గుణపాఠం నేర్పాలన్న నినాదంతో తీవ్రమైన దాడులు చేశాయి. తాము గెలుపొందిన నియోజకవర్గాల్లోనూ ప్రజలకు ఈ బాధలు తప్పలేదు. ఫాసిస్టు భావజాలంతో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చిన పాలకపార్టీ ప్రజాస్వామ్యం, ప్రకటిత విలువలపై ఎల్లవేళలా దాడిచేసేందుకు సిద్ధంగానే ఉంటోంది. త్రిపురలో ప్రజాస్వామ్యశక్తులు ప్రస్తుతం దాడుల అనుభవాన్ని పొందుతున్నారు.

2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించాలని ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో బీజేపీ ఇప్పటికే కావలసిన ఏర్పాట్లు చేసింది. అవసరమైన సాయుధసంపత్తిని సమకూర్చుకుంది. క్రూరత్వాన్ని, మోసాన్ని ఇబ్బడిముబ్బడిగా ఉపయోగించింది. అధికారం చేజిక్కించుకోవడమేవారి అజెండా. మేఘాలయలో బీజేపీ రెండు సీట్లను మాత్రమే గెలుచుకుంది. ఆ పార్టీ అసలు స్వరూపాన్ని మోదీ ప్రదర్శించారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి కాన్రాడ్ కే సంగ్మా అవినీతికి పెట్టిందిపేరని అవినీతిలో మొనగాడని మోదీ, షాలు తీవ్రంగా ధ్వజమెత్తారు. మోదీ రాత్రికి రాత్రే ఎత్తుగడనుమార్చి సంగ్మా పార్టీతో పొత్తు కుదుర్చుకున్నాడు. ఈ పనిమీదనే మోదీ ప్రత్యేకంగా షిల్లాంగ్‌కు వెళ్లారు. సంగ్మా ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యాడు. నాగాలాండ్ కథ కూడా ఏమీ మార్పులేదు. ఇక్కడకూడా బీజేపీ అధికారంలో భాగం పంచుకున్నది. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ అధికారంలో భాగస్వామ్యం కావడానికి మోదీ వెనుకాడడంలేదు. దోచుకుంటున్న అదానీ వంటి వాళ్లకు అండగా నిలిచేందుకు ఏదో ఒక విధంగా అధికారం సంపాదించడానికి ఉన్నారు. ప్రశాంతంగా జీవించడానికి ప్రజాస్వామ్య హక్కులను కోరు కుంటున్న వారిని అణచివేసేందుకు, వారి గొంతులు వినపడకుండా చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ మార్గాన్ని సుగమం చేసుకుంది. ప్రస్తుతం త్రిపుర కల్లోల పరిస్థితుల్లో ఉన్నది. అందువల్ల అన్ని ప్రజాస్వామ్య శక్తులు త్రిపుర సోదర, సోదరీమణులకు అండగా నిలవాలి.

వ్యాస రచయిత సీపీఐ కార్యదర్శి

ఉపాధి హామీ ఘనం-నిధులే అధమం

అతి తక్కువ కాలంలో అత్యధిక గ్రామీణ ప్రజానీకానికి చేరువైన సంక్షేమ కార్యక్రమం మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం. యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం అమలుకు వామపక్షాలు పట్టుబట్టాయి. గ్రామీణ భారతంలో కోట్లాదిమందికి ఉపాధి కల్పనద్వారా నిరుద్యోగ సమస్యను రూపుమాపడం, గ్రామీణ వలసలను అంతమొందించడం, సామాజిక ఆస్తులను సృష్టించడం, గ్రామీణగిరాకీని పెంచి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడం ఈ పథకం లక్ష్యం. ఈ పథకం అమలులోకి వచ్చి సుమారు 17సంవత్సరాలు దాటింది. ఈ మధ్యకాలంలో ఈ పథకంకింద నిర్ణీత కాలంలో గ్రామీణులకు ఉపాధి లభించి, కొంతమేరకువారి బతుకుల్లో ఆశాదీపాలు వెలిగిన మాట నిజం. మరోవైపు పోనుపోను దీని నిర్వహణ కొంత అవినీతిమయమైందన్న ఆరోపణలోనూ వాస్తవం లేకపోలేదు. ఎన్‌డీఏ సర్కారుకు దీనిని కొనసాగించే ఆలోచన మొదట్లోలేదు. ఈ పథకంపై ప్రధాని సహా ఒకరిద్దరు మంత్రులు ఆ రోజుల్లో విమర్శలు కూడా చేసారు. ఈ పథకానికి గత నాలుగేళ్లుగా బీజేపీ ప్రభుత్వ కేటాయింపులు పరిశీలిస్తే, ఏటా నిధులు తగ్గుముఖం పడుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగానే కుదించింది. 2020-21లో రూ.1,11,169 కోట్లు 2021-22లో రు.98,000కోట్లు, 2022-23 ఏడాదికి రూ.73,000కోట్లు కేటాయించగా, తాజా 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60,000 గ్రామీణ నిరుద్యోగిత 7శాతంతో కొనసాగుతున్న నేపథ్యంలో నిధులు, పనిదినాలు మరింత పెంచవలసిన అవసరముంది.

దేశంలో అత్యధిక జనాభా గ్రామాల్లోనే నివసిస్తున్నారు. అలాగే పట్టణ పేదరికం కన్నా గ్రామీణ పేదరికం ఎక్కువ. ఒక అంచనా ప్రకారం ఇది సుమారు 30శాతం. ఈ కారణం చేతనే ఉపాధిహామీ పథకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రవేశపెట్టారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ ప్రకృతి విపత్తులను తరచూ ఎదుర్కొంటున్న వ్యవసాయంపైనే ఆధారపడి వుంటుంది. దీనితోబాటు పెరుగు తున్న వ్యవసాయఖర్చులు, చిన్న, సన్నకారు రైతులను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. గ్రామీణ భారతంలో అత్యధిక పేదలుగా పేరొందిన షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలలో, షెడ్యూలు కులాల జనాభా కొంతమేర ప్రయోజనంపొందగా వారి సహచరులైన షెడ్యూలు తెగలు మాత్రం పేదరికం నుంచి విముక్తులు కాలేదు. జనజీవన స్రవంతికి వీరంతా దూరంగా ఉండడం, మూఢ విశ్వాసాలతో జీవనం గడపడం దీనికి కారణం. చాలా రాష్ట్రాల్లో ఒకపక్క ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ఆహారభద్రత

కల్పించడం, గ్రామాల్లో మెరుగైన స్వయం సహాయక సంఘాల పనితీరు, గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం వంటి వాటిద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రక్రియలో తమ పాత్రను పోషిస్తున్నాయి. నరేగా పాత్ర దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిలో కొనుగోలు శక్తి పెరగడానికి ఈ పథకమే కారణం. నిరుపేదలకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన వినూత్న పథకంగా ఈ పథకాన్ని పశంసిస్తున్నారు.

దేశీయ విశ్వవిద్యాలయాల్లోనూ, విదేశీ విశ్వవిద్యాలయాల్లోనూ ఈ పథకంపై ఇంతవరకు శాస్త్రీయ అధ్యయనాలు జరిగాయంటే ఈ పథకం ఘనత ఎంతో అర్థమౌతోంది. గతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ సైన్సు, బెంగుళూరు అధ్యయన నివేదికసైతం ఈ పథకం అమలువల్ల వస్తున్న సానుకూల మార్పులను వెలుగులోకి తెచ్చింది. అలాగే 2016లో ఓస్లో(నార్వే) విశ్వవిద్యాలయ పరిశోధకుడు ఈ పథకానికి ఆకర్షితుడై అనంతపురం జిల్లా లోని వివిధ గ్రామాలను సందర్శించి దీని అమలుతీరు తెన్నులను నిశితంగా గమనించి ఇదెంతో గొప్ప సంక్షేమ పథకమని కొనియాడారు. ఈ పథకం గ్రామీణ పేదలకు వివిధ రకాలుగా ఉపయోగపడుతోంది. వారిలో కొనుగోలు శక్తి పెరుగుతోంది. వలసలు కొంతవరకు తగ్గుముఖం పడుతున్నాయి. మహిళా కూలీల వాటా ఎక్కువగా ఉండటంతో వారిలో చైతన్యం పెరిగింది. లబ్ధిదారుల్లో అత్యధికులు దళితులే. వారికి ఊతం లభించింది. కరోనా కష్టకాలంలో తమ గ్రామాలకు తిరిగివచ్చిన కుటుంబాలను ఆదుకున్నది ఈ పథకమే. ఈ పథకం కింద సామాజిక పనుల వాటా 2015లో నమోదైన 16శాతం నుంచి 2022 నాటికి 73 శాతానికి పెరిగాయని 2022-23 ఆర్థికసర్వే పేర్కొంది. ఇంతటి ఘనచరిత్ర కల్గిన ఈ పథకానికి ఏటాకేటాయింపులు తగ్గడం ఆశ్చర్యకరం. ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రు.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది గత ఏడాది కన్నా తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పాదక ఆస్తుల కొరకు మహిళా గ్రూపుల సమిష్టి కృషితో వనరుల సమీకరణ, నీటి సంరక్షణ పనులు, సాలిడ్, లిక్విడ్ వనరుల నిర్వహణ, గ్రామీణ గృహనిర్మాణం, పశువుల షెడ్ల నిర్మాణం, వానపాముల ఎరువుల తయారీ, గుంటలు తవ్వడం, భారీస్థాయిలో మొక్కలు నాటడం, పార్మగుంటలు తవ్వడం, అంగన్వాడీ భవనాల నిర్మాణం, పక్కా గ్రామీణ రోడ్ల నిర్మాణం ఇవన్నీ ఉపాధి హామీ పథకంతోనే సాధ్యమవుతున్నాయి.

లోపాలు: భారతీయ గ్రామీణ ఆర్థికవ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపు తున్న ఈ పథకంలో చాలాలోపాలు కారణంగా విమర్శల నెదుర్కొంటుంది. ఈ క్రమంలో ఈ పథకం అమలు తీరుతెన్నులపై కేంద్రం గ్రామీణాభివృద్ధి మాజీ కార్యదర్శి అమర్‌జిత్ సిన్హా నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ పేదరిక నిర్మూలనలో ఈ పథకం సామర్థ్యాన్ని మదింపు వేయనుంది. కూలిపనులకు వెళ్లివెత్తుతున్న కోట్లాదిమంది అభ్యర్థనలవెనక అసలు కారణాలు, దీని అమలులో రాష్ట్రాలమధ్య వైరుధ్యాలు తదితరాలను పరి శీలిస్తుంది. ఈ పథకానికి మరింతగా మెరుగుపెట్టేందుకు సూచనలను చేస్తూ ఈ కమిటీ త్వరలో తన నివేదికను సమర్పించనుంది. చేయని పనులకు చేసినట్లు బిల్లులు పెట్టడం, కూలీలకు సొమ్ము చెల్లించడంలో అలవిమాలిన జాప్యం, ద్రవ్యోల్బణ సూచీలకనుగుణంగా వేతనాలు పెంచకపోవడం, కేంద్ర నిధులను రాష్ట్రాలు ఇతర ఖర్చులకు వినియోగించడం, పర్యవేక్షణలోపాలు, పనుల్లో నాణ్యత లోపించడం, దొంగ జాబు కార్డులు, హాజరు పట్టీలో అక్రమాలు వంటివి పథకం ఉద్దేశ్యాన్ని నీరుగారుస్తున్నాయి. సామాజిక ఆస్తుల కల్పనలోనూ రాష్ట్రాలు వెనుకబడినట్లుగా అధికారిక గణాంకాలు చెబు తున్నాయి. చివరిగా ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి 100 రోజులు పనిదినాలు ఏడాదిలో నిర్దేశించినా, వాస్తవానికి 2020-21లో ఇది సగటున 48 దినాలు దాటలేదు. అత్యధికంగా నమోదైన పనిదినాలు ఆ ఏడాదిలో కేవలం 52 మాత్రమే.

డాక్టర్ యస్.వై. విష్ణు, సెల్ 363217252

చరిత్ర చీకటిపొరల్లో మత మౌఢ్యం

డాక్టర్ దేవరాజు మహారాజు

అజ్ఞానం ముందు వంగి లేచేది మతం. అజ్ఞానం చుట్టూ ప్రదక్షిణలు చేసేది మతం. సంకుచితత్వం, దురహంకారం, రాజకీయాలతో కలగలిసి చరిత్రను మానవరక్తంతో గడ్డకట్టించింది మతం. ఏ కాలమైనా మతం సృష్టించింది చీకటే. చీకటికి పర్యాయపదమే మతం. మత కలహాల విశ్వరూపాన్ని దర్శింపచేయడమే భీష్మ సహాని నవల 'తమస్' ఉద్దేశం. ప్రముఖ హిందీ నవలా రచయిత నవలకు అదే పేరుతో గోవింద్ నిహలానీ రూపొందించిందే 'తమస్' చలన చిత్రం. "చీకటి రోజుల్లో కళలూ, కవిత్వాలు ఉంటాయా?" అని ప్రశ్నించాడు జర్మన్ మహాకవి బెర్టోల్ట్ బ్రెష్ట్. ఉంటాయి! అయితే అవి చీకటి రోజుల గురించి మాత్రమే ఉంటాయి." అని ఆయనే సమాధానం కూడా చెప్పాడు. "గత చరిత్ర నుండి గుణపాఠం నేర్చుకోనివారు, అవే తప్పిదాల్ని మళ్లీ మళ్లీ చేయకమానరు" అని ప్రత్యక్షంగా అనుభవించి చెప్పాడు హిందీ చలన చిత్ర దర్శకుడు గోవింద్ నిహలానీ. గతంలోనే కాదు. మతకలహాల చీకటి వర్తమానంలో కూడా దేశమంతా వ్యాపించే ఉంది. ఇది నడుస్తున్న చరిత్రకు వ్యాఖ్యానం.!

1947 ఆగస్టు దేశ విభజనకు ముందు జలాలాబాదులో జరిగిన సంఘటనల ఆధారంగా భీష్మ సహాని (హిందీ నటుడు బలరాజ్ సహాని తమ్ముడు) నవల రూపుదిద్దుకుంది. అటు సింధ్ ఇటు పంజాబ్‌ల మధ్య, అటు ముస్లింలు ఇటు హిందువులమధ్య, అటు ముస్లింలీగ్ ఇటు కాంగ్రెస్ రాజకీయాలమధ్య ఐదులక్షలమంది అసువులు కోల్పోయారు. పదిహేను మిలియన్ల మంది కూడునీడ లేక నిరాశ్రయులై పాకిస్థాన్, భారతదేశంలోకి వలసవెళ్లారు. తప్పులు ఇరుపక్షాల వారివీ ఉన్నాయి. కాబట్టి జరిగిన నరమేధం వెనుక లోపించిన మానవ విలువల్ని, అప్పటి హీనమైన సమయాన్ని 'తమస్' చలన చిత్రం బేరీజు వేసింది. ఇందు లోని సంఘటనలు ఆకాలానికే పరిమితంకాదు. అహ్మదాబాద్, భివాండి, మొరాదాబాద్, మీరట్, హైదరాబాద్ లలో అప్పుడప్పుడు జరుగుతూ వచ్చిన హిందూ ముస్లిం కొట్లాటల వల్ల ఈ కళ ఈ కాలానిదే అని సాక్ష్యం పలుకు తుంది. హిందూ రాజ్యం, ఖలిస్తాన్‌ల కోసం జరుగుతున్న తీవ్రవాద రక్తపాతాలు అందుకు వంతపాడుతున్నాయి. అంతేకాదు కరాచీ వీధులలో మొహజిర్-నాన్ మొహజిరాల మధ్య జరుగుతున్న ఘర్షణలు-ప్రస్తుతం కేరళలో హిందుత్వ, వామపక్ష వర్గాల మధ్య జరుగుతున్న హత్యలు 'తమస్'లో చూసుకోవచ్చు. రాజకీయ ప్రయోజనాలకోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఆంధ్ర తెలంగాణ ఉద్యమాలలో వందలాది అమాయకులు బలి గుర్తు తెచ్చుకోవచ్చు. కొద్దిపాటి తేడాలతో మత-రాజకీయాలకు సంబంధించిన ఏ అల్లర్లలోనైనా నష్టపోయేది ప్రజలే! ఈ విశ్వజనీనమైన నిజాన్ని మనకు దర్శింపచేయడానికి దర్శకుడు చేసిన తపస్సే-తమస్! మానవ సంబంధాల్ని మరింత మెరుగుపరచ డానికి మతాల్ని, నీచరాజకీయాల్ని దూరంగా తరిమేయ డానికి, నిజమైన విశ్వశాంతిని కాంక్షించడానికి తప్పదు, మనం ఎక్కడో ఓ చోట ఈ విధానాల్ని మార్చుకోక తప్పదు- అని గోవింద్ నిహలానీ 'తమస్'లో చెప్పడానికి ప్రయత్నించాడు.

ఆ చిత్రంలోని కథాంశం ఈ విధంగా ఉంటుంది. ఎవరో ధనవంతులైన హిందువులు అర్ధరాత్రి నాథూ ఇంటికి వస్తారు. డబ్బులిచ్చి ఒక పందిని చంపమంటారు. తను చంపిన పంది ఉదయానికి మసీదు ముందుకు చేరుతుందని, దానితో పట్టణంలోని హిందూ ముస్లింల మధ్య అపార్థాలు ఎక్కువై తీవ్రపరిణామాలకు దారితీస్తాయని నాథూ ఊహించడు. కాంగ్రెస్ వాళ్ల 'ప్రభాత భేరి' కార్యక్రమం అర్థాంతరంగా ముగుస్తుంది. మరోపక్క 'అల్లాహో అక్బర్' నినాదాల్ని తొక్కేయడానికి 'హరహర మహాదేవ' బృందం బయలుదేరుతుంది. కత్తులు, కర్రలు తిప్పగలిగే ఖాకీ నిక్కర్ల యువకులు 'హిందూసభ' గా విజృంభిస్తారు. వీరందరి మధ్య నాథూ పాత్ర ఎంతో ఉదాత్తమైంది. మత రాజకీయాల్లో చిక్కుకుని, బలైపోయే లక్షలాది సామాన్యులకు ప్రాతినిధ్యం వహించే పాత్ర "ఇంతగా కుళ్లిపోయిన ఈ సమాజంలోకి మన కొడుకును ఎందుకు రానివ్వాలి?" అని నాథూ (ఓంపురి) గర్భవతి అయిన భార్యను ప్రశ్నిస్తాడు. "వాడి పుట్టుకను ఆపడానికి మనమెవ్వరం? వాడికి కావల్సిన సమాజం కోసం వాడే సంఘర్షిస్తాడు" అని ఆమె (దీపా సాహి) జవాబు చెపుతుంది. ఇక్కడ కొడుకు పుట్టడానికి భారత స్వాతంత్ర్యోద్యమానికి అన్వయిస్తాడు దర్శకుడు.


భీష్మ సహాని

నవలలోలేని కొన్ని కొత్త విషయాలు కూడా దర్శకుడు చిత్రంలో చేర్చుకున్నాడు. ఉదాహరణకు స్త్రీలు బావిలో దూకిన సంఘటన! ఒకసారి ముస్లింలతో కొట్లాడి సిక్కులు మరణించారని వార్త తెలుస్తుంది. వారికి సంబంధించిన సిక్కు స్త్రీలందరూ పిల్లలతో సహా ఊరిబావిలోకి దూకుతారు. పంజాబ్‌లోని ఒక గ్రామంలో జరిగిన "ఖుర్బానీ" ఘటనని దర్శకుడు అదనంగా చేర్చుకున్నాడు. భీష్మ సహాని నవలలో ఈ సంఘటన లేదు. అలాగే ఉత్కంఠ భరితంగా సాగే మరికొన్ని సంఘటనలు కూడా చిత్రంలో ఉన్నాయి. ఒక ముస్లిం మహిళ కాఫిర్లయిన సిక్కు దంపతులకు ఆశ్రయమిస్తుంది. మరోచోట ముస్లిం ఉపాధ్యాయుణ్ణి ఒక సిక్కు మహిళ 'సజీవ దహనం' నుండి కాపాడుతుంది. పాకిస్థాన్‌లో స్థిరపడ్డ రబాబీలు ఒకప్పుడు గురునానక్ శిష్యులు. అయినా ఇప్పుడు వారు ముస్లిం ఆచార వ్యవహారాలు, నియమాలు కూడా పాటిస్తారు. సామాన్యుల్లో సుహృద్భావం జాతీయ సమైక్యతను ఆకాంక్షించే గుణం నిండుగాఉంది. దాన్ని వెలికితీసి చూపే ప్రయత్నంచేశాడు దర్శకుడు. అతనిలోని మార్క్సిస్టు దృక్పథం ఇందులో కళాత్మకంగా బైటపడింది.

చలనచిత్ర దర్శకుడు గోవింద్ నిహలానీ బాల్యం కరాచీలో గడిచింది. 'డాన్' వార్తా పత్రిక కార్యాలయం ఎదురుగా మేడమీద వీరి కుటుంబం ఉండేది. వారి ఇంటికింద ఒక పాన్‌షాపు ఉండేది. పాన్ షాప్ యజమాని ఆందోళనకారులకు భయపడి, పైకి నిహలానీ వాళ్లింటికి వచ్చాడు. ఆ రోజు సంపాదించిన మొత్తం నిహలానీ తండ్రికి అప్పగించాడు. దాచిపెట్టమనిచెప్పి, తప్పించుకుని పారిపోదా మని కిందకి వెళ్లాడు. అంతే ఆందోళనకారులు అతణ్ని కాల్చేశారు. ఇదంతా బాలుడిగా నిహలానీ ప్రత్యక్షంగా చూశాడు. మతకల్లోల భయంకర స్వరూపం ఆనాడే ఆ పసిహృదయం మీద చెరగని ముద్రవేసింది. ఆ అనుభవం అతణ్ణి ఊరుకోనివ్వలేదు. చిత్రసీమలో ప్రవేశించిన తర్వాత, మత కల్లోలంపై సినిమా తీయాలన్న కోరిక బలపడింది. ఫలితంగానే 'తమస్' (చీకటి) పేరుతో సమాజంలో వెలుగులు ప్రసరించాయి.

దర్శకుడు గౌతమ్‌ఘోష్ తీసిన బెంగాలి చలనచిత్రం 'అంతర్జలి యాత్ర' కంచి శంకరాచార్యకు ఓ సవాల్ విసిరింది. కొన్నేళ్ల క్రితం 'సతి'పై వాదోపవాదాలు చెల రేగాయి. జాతీయ స్థాయిలో విమర్శలు, ప్రతి విమర్శలు కొన సాగాయి. అందుకు కారణం పూరి శంకరాచార్యులు, కంచి శంకరాచార్యులూ కలిసికట్టుగా 'సతి'ని బాహాటంగా బల పరచడమే! ఖాండ్వా జిల్లాలోని ఓంకారేశ్వర్‌లో బైటపడ్డ రెండువేల యేళ్ల కిందటి ఒక గుహను ప్రారంభిస్తూ స్వామి జయేంద్ర సరస్వతి 'సతి'ని ప్రోత్సహిస్తూ మాట్లాడాడు. హిందూ మత పునరుద్ధరణలో 'సతి' కూడా భాగమేనన్నాడు. కొన్ని వేల యేళ్ల కిందటి గుహను వెలుగులోకి తేవాలని ఆయనగారి ఉబలాటం కాబోలు! విశేషమేమంటే వారి పత్రికా విలేకరుల గోష్టిలో మహారాష్ట్ర పౌర సంబంధ, ఆర్థికశాఖ ఉపమంత్రి, నాగపూర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉన్నారు. ఇలాంటి సంఘటనల్లో అలాంటి వారి గూర్చి విన్నప్పుడు మనకు 'చదువుకున్న మూర్ఖులు' అనే పదం గుర్తుకొస్తుంది. 'స్త్రీ అత్యాచార్ విరోధి సమితి' పూనుకొని శంకరాచార్య ప్రకటనను నిరసించడంతో విషయాలు మరింతగా వెలుగులోకి వచ్చాయి. మానవ పురోగమనానికి అడ్డుపడే అలాంటి దద్దమ్మలంతా పెద్దలై కూర్చోబట్టే దేశమింకా ఈసురోమంటోంది. ఎవడి మతం వాడు, ఎవడి డబ్బా వాడు వాయించుకోకపోతే మానవాళి సమస్యను హేతువాద దృక్పథంతో పరిశీలించొచ్చు కదా? భార్య చనిపోతే, 'పతి' ఆమె శవంతో పాటు చితిమీద పడి సజీవంగా కాలి చావాలన్న నియమంఉంటే మరి ఈ స్వాములు ఏం మాట్లాడేవారూ? 'పతి'ని బలపరిచేవారా?

ఇటు ఇంట్లో స్త్రీలను, అటు బైట ఇతర కులాలవారిని తమ చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి అగ్రవర్ణం వారు ఏర్పరచిన నియమాలు, నిబంధనలు ఎంతటా హాస్యాస్పద మైనవో, ఎంత నికృష్టమైనవో 'అంతర్జలి యాత్ర' చలన చిత్రం స్పష్టం చేసింది. బెంగాలి రచయిత కమల్‌కుమార్ మజుందార్ కథకు రూపకల్పనే - ఈ సినిమా! కథాంశం ఈ విధంగా ఉంటుంది. వృద్ధ బ్రాహ్మణుడు సీతారాం అవసాన కాలం దగ్గరికొస్తుంది. జాతకాలు చెప్పే బ్రాహ్మణుడు పరిగెత్తు కొస్తాడు "వృద్ధ బ్రాహ్మణుడు అప్పుడప్పుడే చనిపోడని, మళ్లీ పెళ్లి చేస్తే భార్యతోపాటే జంటగా పరలోకాలకు చేరు కుంటాడని" జోస్యం చెపుతాడు. ఇప్పుడో అప్పుడో అన్నట్లున్న వృద్ధ బ్రాహ్మణుణ్ణి అప్పటికే స్మశానానికి తరలిస్తారు. జ్యోతిష్యుడి మాటమీద, ఉన్నఫలంగా వృద్ధుడికి స్మశానంలోనే పద్దెనిమిదేళ్ల కన్యతో హడావుడిగా వివాహం జరిపిస్తారు. కన్య తండ్రి చాలా పేదవాడు. కూతురికి పెండ్లి చేయలేదనే లోకనింద తప్పించుకోవడానికి పరోక్షంగా కూతురిని చంపడానికే సిద్ధపడ్డాడన్నమాట! ముఖ్యంగా సమాజాన్ని వెనక్కి నడిపించే ప్రభుత్వాలున్నప్పుడు ప్రజలు మరింత అప్రమత్తతో ఉండాలి!

కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

జైల్లో పెట్టి ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరు

మనీశ్ సిసోడియా

న్యూదిల్లీ: జైల్లో పెట్టి తన ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా స్పష్టం చేశారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. తాజాగా ఆయన ట్విటర్ వేదికగాపై విధంగా వ్యాఖ్యానించారు. 'సర్... మీరు నన్ను జైల్లో ఉంచి ఇబ్బంది పెట్టగలరు. కానీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. బ్రిటిషర్లు కూడా స్వాతంత్ర్య సమరయోధులను ఇబ్బందులకు గురిచేశారు. వారి స్థైర్యాన్ని కదిలించలేకపోయారు' అని సిసోడియా ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. శుక్రవారం సిసోడియా బెయిల్ పిటిషన్‌పై దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు విచారణ చేపట ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. మరోవైపు సీబీఐ కేసులో ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణను మార్చి 21వ తేదీకి వాయిదా వేసింది.

రేపు రాజ్‌భవన్ ఎదుట యూపీ కాంగ్రెస్ నిరసన

లక్నో : పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి ఇతర సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఉత్తర ప్రదేశ్ విభాగం సోమవారం ఇక్కడ రాజ్‌భవన్ వెలుపల నిరసనను నిర్వహించనున్నట్లు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బ్రిజ్‌లాల్ ఖబ్రీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాయం, దౌర్జన్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని గణాంకాలు సూచిస్తున్నాయని, అయితే బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిద్రలో ఉందని ఆరోపించారు. ప్రభుత్వ రక్షణలో ఉన్న విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు అవినీతికి పాల్పడుతుండగా, పారిశ్రామిక మిత్రులకు ప్రజాధనంతో సాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, చట్టపరిధిలో అహింసాయుత ప్రదర్శన నిర్వహిస్తామని, రాజ్‌భవన్ ముట్టడి చేస్తామంటే పోలీసు బారికేడ్‌లు కూడా అడ్డుకోలేవని అన్నారు. బీజేపీ ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక ముఖాన్ని కాంగ్రెస్ బయటపెడుతుందని ఖబ్రీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరిస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం దీనిపై ఏమీ చేయదల్చుకోవడం లేదని ఆయన తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పెట్టుబడిదారీ మిత్రులకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తోందని, దేశ ప్రజలు ప్రతి విషయాన్ని అర్థం చేసుకున్నారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఉత్తరాఖండ్ అల్లోపతి డాక్టర్లకు ఆయుర్వేదంలో శిక్షణ

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని అల్లోపతి వైద్యులు ఆయుర్వేదంలో ఆరు రోజుల శిక్షణ పొందుతారని, సంప్రదాయ వైద్య విధాన సమర్థతపై సందేహాలను నివృత్తి చేయడంలో ఈ కార్యక్రమం సహాయపడుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ సంధు శనివారం తెలిపారు. అల్లోపతి, ఆయుర్వేదం పరస్పర విరుద్ధమైనవి కావనీ, ఒకదానికొకటి సహకరించుకునేవని ఆయన పేర్కొన్నారు. ఆయుష్ విభాగం వాస్తవాలు, పత్రాల ఆధారంగా ప్రదర్శనలను ఉపయోగించి శిక్షణను నిర్వహిస్తుందని సంధు వివరించారు.

'ఆయుర్వేద చికిత్స గురించి తప్పుడు అభిప్రాయాలను తొలగించడం, అల్లోపతి వైద్యులు దాని సమర్థతపై వారి సందేహాలను నివృత్తి చేయడంలో సహాయపడటం ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం ఉద్దేశం' తెలిపారు. అయితే ఈ కార్యక్రమాలు జరిగే తేదీలను ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఆయుర్వేదం కేవలం వైద్యవిధానం మాత్రమే కాదని, వ్యాధిరహిత జీవితాన్ని నడిపించే మార్గమని సంధు అన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ కీలక సమావేశం

సమల్ఖా : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అఖిల భారతీయ ప్రతినిధి సభ ఆదివారం ఇక్కడ ప్రారంభం కానుంది. మూడు రోజుల వార్షిక సమావేశంలో సామాజిక సామరస్య వాతావరణాన్ని సృష్టించడం, వారి విధులను నిర్వహించేలా ప్రజలను ప్రేరేపించడం, వారిని స్వావలంబన చేసేలా చేయడంపై ఆర్ఎస్ఎస్ నాయకత్వం ఉద్దేశపూర్వకంగా చర్చించనుంది. ఈ సభకు సంస్థ అధ్యక్షుడు మోహన్ భగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే సహా 1,400 మందికి పైగా ఆఫీస్ బేరర్లు హాజరవుతారని ఆర్ఎస్ఎస్ నాయకుడు సునీల్ అంబేకర్ ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ నుంచి అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి (సంస్థ) బీఎల్ సంతోష్‌తో పాటు 34 ఆర్ఎస్ఎస్-అనుసంధాన సంస్థల ఎంపిక చేసిన అనేక మంది ఆఫీస్ బేరర్లు కూడా హాజరవుతారని వివరించారు. అంబేకర్ మాట్లాడుతూ హరియాణాలోని పానిపట్ జిల్లాలోని సమల్ఖాలో మూడు రోజులపాటు నిర్వహించే ఈ సమావేశంలో గత కొన్నేళ్లుగా స్వయం సేవకులు చేసిన అధ్యయనాలు, ఆ అధ్యయనాల ఆధారంగా చేసిన కృషిపై చర్చిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశం అనేక సామాజిక-ఆర్థిక సమస్యలపై చర్చిస్తుందన్నారు. శాఖల పనితీరును కూడా సమీక్షించి భవిష్యత్ కార్యచరణను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

కర్ణాటక మాజీ ఎంపీ ధృవనారాయణ మృతి

మైసూరు (కర్ణాటక): కాంగ్రెస్ కర్ణాటక కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ ధృవనారాయణ(61) శనివారం ఉదయం కన్నుమూసినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తీవ్ర ఛాతినొప్పి రావడంతో ఆయన కారు డ్రైవర్ హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయిందని పేర్కొన్నారు. చామరాజనగర్ నియోజకవర్గం నుంచి రంగస్వామి ధృవనారాయణ రెండుపర్యాయలు అంటే 2009, 2014 గెలుపొందారు. 2014లో నరేంద్ర మోదీ హవాను తట్టుకుని నిలబడ్డవాళ్లలో ఈయన కూడా ఒకరు. అయితే 2019లో దురదృష్టవశాత్తు ఓటమి చవిచూశారు. 2004, 2008లలో ఆయన కర్ణాటక అసెంబ్లీ నుంచి కూడా ఎన్నికయ్యారు. విద్యార్థి దశలోనే ఆయన రాజకీయాల్లో వచ్చారు. 1983లో కాంగ్రెస్‌లో చేరి, 1984లో అగ్రికల్చరల్ కాలేజీ స్టూడెంట్ యూనియన్ నాయకుడిగా ఎన్నికయ్యారు. 1999లో మొట్టమొదటిసారిగా సంతేమారనహళ్లి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయగా, చివరగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు 2004లో అదే నియోజకవర్గం నుంచి కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ధృవనారాయణ మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయన కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు, వాయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి సిద్దా రామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, అనేకమంది నాయకులు ధృవనారాయణ మృతి సంతాపం తెలిపారు. వారం కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

రూ.174 కోట్ల విలువైన 84వేల క్లయిమ్‌లు పరిష్కరించిన ఈఎస్ఐసీ

న్యూదిల్లీ: ఉద్యోగుల స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) 'పక్షం రోజుల్లో ప్రత్యేక సేవలు' పేరిట ఫిబ్రవరి 24 నుంచి మార్చి 10 వరకు దాదాపు రూ.174 కోట్ల విలువైన 84వేల క్లయిమ్‌లు పరిష్కరించింది. బీమా చేయబడిన కార్మికులు, వారిపై ఆధారపడిన వారికి 71 సంవత్సరాల సేవలను పురస్కరించుకుని ఫిబ్రవరి 24న కేంద్ర కార్మికశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఈ పక్షం రోజుల ప్రత్యేక సేవలను ప్రారంభించారు. ఇది మార్చి 10న ముగిసిందని కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 15 రోజులలో, పెండింగ్ బిల్లులు/క్లెయిమ్‌ల క్లియరెన్స్, ఫిర్యాదుల పరిష్కారం, మిల్లెట్ డైట్, యోగాపై దృష్టి పెట్టడం పారిశ్రామిక సమూహాలలో ఆరోగ్య పరీక్షల శిబిరాలకు సంబంధించిన కార్యకలాపాల ద్వారా బీమా చేయబడిన వ్యక్తులు వారిపై ఆధారపడిన వారికి సేవల సౌలభ్యంపై దృష్టి కేంద్రీకరించినట్టు వివరించింది. పక్షం రోజుల్లో దాదాపు రూ.174 కోట్లు విలువైన 84వేల 84,000 క్లెయిమ్‌లు పరిష్కరించినట్టు ఈఎస్ఐసీ తెలిపింది. దాదాపు 73,659 క్లెయిమ్‌లు రూ. 53.02 కోట్లు పరిష్కరించామనీ, బీమా చేయబడిన కార్మికులు వారిపై ఆధారపడిన వారికి డబ్బు చెల్లించినట్టు వివరించింది.

దివ్యాంగురాలిపై లైంగికదాడి... వ్యక్తి అరెస్ట్

హోషియార్‌పూర్ (పంజాబ్): గడచిన ఐదు నెలలుగా ఓ దివ్యాంగురాలిపై వ్యక్తి పదే, పదే లైగింకదాడికి పాల్పడినట్టు శనివారం అధికారులు తెలిపారు. సఖి-వన్‌స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ) స్థానిక సిబ్బంది 26 ఏళ్ల దివ్యాంగురాలిని కాపాడగా, ఆమెపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓఎస్‌సీ స్కీమును 2015-16 మధ్య ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హింసకు గురైన మహిళలకు సహకారం అందించడమే ఈఓఎస్‌సీ ముఖ్య ఉద్దేశం. ఇలాంటి సెంటర్లు పంజాబ్ రాష్ట్రంలో ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేశారు. ఈ కేసు గురించి హోషియార్‌పూర్ ఎస్ఓఓఎస్‌సీ-కం-చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుబాల మాట్లాడుతూ ఓ దివ్యాంగురాలిని జలందర్ బస్టాండ్ నుంచి హోషియార్‌పూర్ బలవంతంగా తరలించడం తాను చూసినట్టు ఓ వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడన్నారు. ఆ వ్యక్తితో ఆమె మాట్లాడుతున్న తీరుపై అనుమానం రావడంతో తాను, తన సిబ్బంది కలిసి ఆమె ఉంటున్న చిరునామాకు వెళ్లగా, అక్కడ ఆ వ్యక్తి దివ్యాంగురాలిపై దాడి చేయడాన్ని గమనించినట్టు వివరించారు. స్థానిక అధికారుల సహాయంతో, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని హోషియార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ కోమల్ మిట్టల్‌ను కోరినట్టు ఆమె వివరించారు. బాధితురాలిని స్థానిక ఆస్పత్రికి తరలించినట్టు మధుబాల వివరించారు. ప్రాథమిక విచారణలో ఐదు నెలలుగా దివ్యాంగురాలిపై నిందితుడు లైంగికదాడి చేస్తున్నాడని ఆమె వివరించారు.

బీహార్‌లో ప్రభుత్వ మార్పునకు స్పందన

ఈడీ దాడులపై: ఓఝూ

న్యూదిల్లీ: బీహార్‌లో గత ఏడాది ప్రభుత్వ మార్పునకు స్పందనగానే ఆర్జేడీ నాయకులపై ఈడీ దాడులు జరుగుతున్నాయని రాజ్యసభలో ఆర్జేడీ పక్ష నేత మనోజ్ ఝూ విమర్శించారు. ప్రతిపక్ష నేతలపై దాడులకు వేరొకరి స్క్రిప్ట్‌ను సీబీఐ, ఈడీలు అనుసరిస్తున్నాయని దుయ్యబట్టారు. ఉద్యోగాల కోసం భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ విచారణకు సంబంధించి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ గురువారం మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ ముగ్గురు కుమార్తెలు, ఆర్జేడీ నేతల ప్రాంగణాలు సహా వివిధ నగరాల్లో సోదాలు నిర్వహించింది. ఈ కేసులో లాలూ ప్రసాద్, రబ్రీ దేవి ఇద్దరినీ ఇటీవల సీబీఐ ప్రశ్నించింది.ఓఝూ మాట్లాడుతూ... 'సీబీఐ, ఈడీ వంటి సంస్థల ప్రతిష్ఠ మసకబారింది... ఇది వారి దాడులు కాదు... వేరొకరి స్క్రిప్టుతో దాడులకు దిగుతున్నారు... లాలూజీ కుమార్తెలు, మన డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ నివాసాల్లో సోదాలు చేశారు... ఏం కనుగొన్నారు. ?' అని ఝూ ప్రశ్నించారు. ఇది ఆగస్టు 2022లో జరిగిన దానికి ప్రతిస్పందన... మూసివేసిన కేసును తిరిగి తెరిచారని అన్నారు. 2020 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీహార్‌లో బీజేపీ, జేడీ(యూ) కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అయితే, తమ పార్టీని బలహీనపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూటమి నుంచి వైదొలిగారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమాజ భాగస్వామ్యం అవసరం

బెంగాల్ ప్రభుత్వం... యునిసెఫ్

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, యునిసెఫ్ బాల్య వివాహాలు, లింగ అసమానత, లింగ ఆధారిత హింసను అంతం చేయడం కోసం సమాజ భాగస్వామ్యంపై దృష్టి సారించే వారి ఉమ్మడి చొరవకు ప్రేరణనిచ్చే సాధనాలను ఆవిష్కరించాయి. పశ్చిమ బెంగాల్ స్టేట్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (డబ్ల్యూబీఎస్ఆర్ఎల్ఎం), 'ఆనందధార' ప్రాజెక్టు అధ్వర్యంలో బాల్య వివాహాలు, ఇతర వాటిని అంతం చేయడానికి బాల-స్నేహపూర్వక 'సంఘాలు' (క్లస్టర్లు) ఏర్పాటు చేయడానికి స్వయం-సహాయక బృందాలను (ఎస్‌హెచ్‌జీ) గత సంవత్సరం సెప్టెంబరు నుంచి నిమగ్నం చేసింది. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో డబ్ల్యూబీఎస్ఆర్ఎల్ఎం సీఈవో విభు గోయెల్ మాట్లాడుతూ వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, యునిసెఫ్ కలిసి పని చేస్తున్నాయని, తద్వారా ఈ దుష్ప్రవర్తనలు శాశ్వతంగా ముగిసిపోతున్నాయని అన్నారు. 'సమాజం భాగస్వామ్యం లేకుండా, ముందుకు సాగడం కష్టం. స్వయం సహాయక బృందాల సభ్యులు, వారి కుటుంబాలు మెరుగైన పద్ధతులను ప్రోత్సహించడం, కమ్యూనిటీ-ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను ప్రవేశపెట్టడం పిల్లల రక్షణ, పిల్లల అభివృద్ధి సమస్యలలో విజయం సాధించడానికి కీలకం' అని యునిసెఫ్ విడుదల చేసిన ఒక ప్రకటనను ఉటంకిసూ గోయెల్ తెలిపారు. కీలకమైన గ్రామీణ జీవనోపాధి మిషన్ అయిన 'ఆనందధార' కార్యక్రమం కింద, పశ్చిమ బెంగాల్ 10.45 లక్షలకు పైగా ఎస్‌హెచ్‌జీలతో దేశంలోని అగ్ర రాష్ట్రాలలో ఒకటి. బాల్యవివాహాలు, ఇతర సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంపై కూడా తాము దృష్టి పెడుతున్నామని గోయెల్ చెప్పారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణపై మరింత ఒత్తిడి తీసుకురావడం గురించి మాట్లాడుతూ 'ప్రక్రియను పర్యవేక్షించకపోతే, విజయాన్ని సాధించడానికి ఎక్కడ, ఏ చర్యలు తీసుకోవాలే విషయాన్ని గుర్తించలేము' అని తెలిపారు. బాల్య వివాహాల నిరోధం, పిల్లల అక్రమ రవాణా, బాలికల గర్భాలను గుర్తించడం వంటి ప్రాజెక్టు మైలురాళ్లను గుర్తించే సాధనాలు వచ్చే రెండు వారాల్లో 'సంఘాలకు' పంపనున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక-వి ప్రకారం రాష్ట్రంలో దాదాపు 48 శాతం మంది గ్రామీణ బాలికలు తక్కువ వయస్సులోనే వివాహాలు చేసుకుంటున్నారు. ఆలస్యంగా, ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి తరువాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బాల్య వివాహాల సంఘటనలు పెరిగాయి. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బాల్య వివాహాలను నిరోధించడానికి, బాలల హక్కుల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించేందుకు ఈ కార్యక్రమాన్ని 110 'సంఘాలకు' విస్తరించనున్నారు.

'అవగాహన, స్వయం సహాయక సంఘాల ద్వారా స్వీయ పర్యవేక్షణ, వారి ప్రాంతంలోని బాలికల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం నిర్దేశిత సామాజిక సమస్యపై అన్ని స్థాయిలలో నిరంతర చర్చలు, చార్ట్‌లు, శ్రవణ, దృశ్య పద్ధతుల సహాయంతో అమలు చేయడానికి ప్రణాళిక చేస్తున్నాము' అని గోయెల్ వివరించారు. 'ఒకసారి మేము కమ్యూనిటీ స్థాయిలో సాధనాలను అమలు చేస్తే, ఈ సామాజిక దురాచారాలను నిరోధించడానికి ఈ ట్రాకర్లు, పత్రాలు సమాజంలో గొప్ప మార్పును కలిగి ఉంటాయి. పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు రక్షణ వాతావరణాన్ని సృష్టించడానికి, సమాజంలో బాల్య వివాహాలు, లింగ ఆధారిత హింస వంటి పద్ధతులను పరిష్కరించేందుకు ఈ చొరవ దోహదపడుతుంది' అని పశ్చిమ బెంగాల్‌లోని యునిసెఫ్ చీఫ్ మహ్మద్ మొహియుద్దీన్ కార్యక్రమంలో అన్నారు.

తమిళనాడు, పుదుచ్చేరిలో అన్ని ఎంపీ సీట్లు గెలుచుకోవాలి

డీఎంకే కార్యకర్తలకు సీఎం స్టాలిన్ పిలుపు

కోయంబత్తూర్ : వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ స్థానాలు, పొరుగున ఉన్న పుదుచ్చేరిలోని ఒకే ఒక్క నియోజకవర్గాన్ని గెలుచుకునేందుకు కృషి చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్ శనివారం పార్టీ కార్యకర్తలకు ఉద్బోధించారు. అన్నాడీఎంకే, డీఎండీకే సహా వివిధ రాజకీయ పార్టీల నుంచి 4 వేల మందికి పైగా అధికార డీఎంకేలో చేరిన సందర్భంగా ఇక్కడ జరిగిన భారీ సభను ఉద్దేశించి స్టాలిన్ మాట్లాడుతూ తమ పార్టీ నేతృత్వంలోని లౌకిక ప్రజాస్వామ్య కూటమి (ఎస్‌డీఏ) గతంలో 2019లో లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షానికి ఒక సీటును కోల్పోయిందని గుర్తు చేశారు. ఇటీవలి ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కూటమి భాగస్వామ్య పక్షమైన కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజలు అఖండ విజయం అందించి ఎస్‌డీఏకు స్పష్టమైన తీర్పును అందించారని, వచ్చే ఎన్నికల్లో మొత్తం 40 స్థానాల్లో (తమిళనాడులో 39, పుదుచ్చేరిలో 1) విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలను కోరారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసినట్లుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మేనిఫెస్టోలో లేనిది... ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలందరికీ రూ.1000, తమిళనాడు ప్రజలకు అందించిన సుపరిపాలన, పథకాలకు ఈరోడ్ ఈస్ట్ గెలుపు అద్దం పడుతోందని స్టాలిన్ అన్నారు. కొన్ని పార్టీలు మతం, కులం పేరుతో గందరగోళం సృష్టించి హింసను రెచ్చగొట్టి, డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన పేర్కొంటూ, ఆ మొత్తం 40 స్థానాల్లో కూటమి గెలుపొందడం వారికి తగిన సమాధానం చెబుతుందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూటమి భాగస్వామ్య పక్షాల విజయానికి డీఎంకే పని చేస్తుందని కూడా చెప్పారు. డీఎంకేను దివంగత సీఎన్ అన్నాదురై స్థాపించిన చరిత్రను వివరిస్తూ, అది అధికారం కోసం కాదని, పేదలు, అణగారిన వర్గాలు, రైతులకు సేవ చేయడానికే ఆవిర్భవించిందని, 2021లో పార్టీ 6వ సారి అధికారంలోకి రాకముందు ఎన్నో ఒడిదుడుకులు, ఉద్వాసనలను చవిచూసిందని తెలిపారు.

భార్య ఆసుపత్రిలో వుంది... విచారణకు రాలేను

సీబీఐతో తేజస్వీ

న్యూదిల్లీ: రైల్వే ఉద్యోగాల కుంభకోణం కేసు లో దర్యాప్తు సంస్థలు విచారణ ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కు చెందిన నివాసంలో ఈడీ శుక్రవారం సోదాలు జరిపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసులో విచారణకు రావాలని సీబీఐ శనివారం ఆయనకు సమన్లు జారీ చేసింది. అయితే, నేడు తాను హాజరుకాలేనని తేజస్వీ చెప్పినట్లు తెలుస్తోంది. గర్భిణీ అయిన తన భార్య ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న కారణంగా విచారణకు రాలేనని సీబీఐకి ఆయన సమాచారమిచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రైల్వే ఉద్యోగాల కుంభకోణంలో ఆ శాఖ మాజీ మంత్రి లాలుప్రసాద్ బంధువులు, ఆర్జేడీ నేతల ఇళ్లు, ప్రాంగణాల్లో ఈడీ శుక్రవారం సోదాలు నిర్వహించింది. దక్షిణ దిల్లీలో తేజస్వీ యాదవ్ బసచేసిన ఒక నివాసంలోనూ ఈ సోదాలు జరిగాయి. ఆ తనిఖీల్లో భాగంగా గర్భిణీ అయిన తేజస్వీ భార్యను 15 గంటల పాటు ప్రశ్నల పేరుతో వేధించినట్లు ఆర్జేడీ విమర్శించింది. దీంతో ఆమె రక్తపోటు పెరిగి అనారోగ్యానికి గురయ్యారని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నారని పేర్కొంది. ఈ సమయంలో తేజస్వీ యాదవ్‌కు సీబీఐ సమన్లు జారీ చేయడంతో ఆయన రాలేనని చెప్పినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తాను భార్య పక్కన ఉండాల్సిన అవసరం దృష్ట్యా విచారణకు హాజరుకాలేనని తేజస్వీ సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ కేసులో మార్చి 4వ తేదీనే విచారణకు రావాలని సీబీఐ తేజస్వీకి సమన్లు ఇచ్చింది. అయితే, కొన్ని కారణాల రీత్యా ఆయన అప్పుడు హాజరుకాకపోవడంతో శనివారం మళ్లీ సమన్లు జారీ చేశారు. 2004 నుంచి 2009 మధ్య లాలు రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో భారతీయ రైల్వేలో 'గ్రూప్-డి' ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు సీబీఐ ఆరోపించింది. నాడు ఉద్యోగాలు పొందినవారు లాలు, ఆయన కుటుంబ సభ్యులకు, ఏకే ఇన్ఫోసిస్టమ్స్ సంస్థకు భూములను లంచంగా ఇచ్చారని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి లాలును, ఆయన సతీమణి రబ్రీదేవిని సీబీఐ ఇటీవల ప్రశ్నించింది. ఇదే వ్యవహారంపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ శుక్రవారం దిల్లీ, బీహార్, ముంబైలో మొత్తం 25 చోట్ల సోదాలు చేపట్టింది. తేజస్వీ నివాసంతో పాటు లాలు కుమార్తెలు, బంధువుల ఇళ్లల్లోనూ తనిఖీలు జరిపింది.

కేంద్రానివి రాజకీయ అణచివేత చర్యలు

- లొంగని విపక్షాల గొంతు నొక్కుతోంది
- తేజస్వీకి సీబీఐ సమన్లపై ప్రియాంక గాంధీ వాద్రా

న్యూదిల్లీ : కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిపక్షాల లొంగని గొంతులను 'అణచివేసే' రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శనివారం ఆరోపించారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌పై దర్యాప్తు సంస్థల చర్య ఇందులో భాగమని అన్నారు. ఉద్యోగాల కోసం భూ కుంభకోణంలో విచారణకు హాజరు కావాల్సిందిగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తేజస్వి యాదవ్‌కు సమన్లు పంపిన తర్వాత కేంద్రంపై ఆమె ధ్వజమెత్తారు. ప్రియాంక గాంధీ హిందీలో చేసిన ట్వీట్‌లో 'బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతులను చూసి ఎందుకు భయపడుతోంది?' అని అన్నారు. సాధ్యమైన అన్ని మార్గాలను అవలంభించడం ద్వారా ప్రభుత్వం ప్రతిపక్షాల లొంగని గొంతులను 'అణచివేసే' రాజకీయాలకు పాల్పడుతోందని అని తెలిపారు. 'బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ జీపై దర్యాప్తు సంస్థల చర్య ఈ రాజకీయాల నుంచి ప్రేరణ పొందింది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. 'ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటారు' అని ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యుల నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాల నేపథ్యంలో కేంద్రంపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతలపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని చంపడానికి దుష్ట ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

నా తండ్రి లైంగికంగా వేధించాడు: స్వాతి మాలివాల్

న్యూదిల్లీ: బాల్యంలో తన తండ్రి తనను లైంగికంగా వేధించాడంటూ దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ తాజాగా ఆరోపణలు చేశారు. డీసీడబ్ల్యూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అనంతరం ఆమె ఈ మేరకు మాట్లాడారు. '4వ తరగతి వరకు మేం ఆయనతో కలిసి ఉన్నాం. నన్ను ఆయన అకారణంగా కొట్టేవారు. కొన్నిసార్లు రక్తం వచ్చేది. ఆయన ఇంట్లోకి వస్తే.. చాలా భయమేసేది. ఎన్నోసార్లు మంచం కింద దాక్కున్నా. ఆ సమయంలో.. మహిళల హక్కుల కోసం ఏం చేయాలనేదానిపై ఆలోచించేదాన్ని. ఈ తరహా దుర్మార్గాలకు పాల్పడేవారికి గుణపాఠం చెప్పాలనుకున్నా' అని స్వాతి మాలివాల్ వెల్లడించారు. 'జీవితంలో దారుణాలను ఎదుర్కొన్నవారు.. ఇతరుల బాధను మరింత అర్థం చేసుకోగలరు. ఈ క్రమంలోనే వ్యవస్థనూ మార్చగలరు. నా విషయంలో ఇదే జరిగింది. ఈ రోజు అవార్డు పొందినవారిలో చాలావరకు మహిళలది దాదాపు ఇదే తరహా పరిస్థితి. తల్లి, పిన్ని ఇతర కుటుంబ సభ్యుల సహకారం లేకపోతే అప్పటి అకృత్యాల జ్ఞాపకాల నుంచి బయటపడేదాన్నే కాదు' అని స్వాతి మాలివాల్ చెప్పారు. ఇదిలా ఉండగా.. సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ సైతం తన తండ్రిపై ఇటీవల ఇదే తరహా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తనను గాయపరిచి, చిత్రహింసలకు గురిచేసేవాడని ఆమె చెప్పారు.

2017లో ఇలాంటివి జరిగాయి

- అవి రాజకీయ ప్రేరేపితమైనవే
- లాలూ, తేజస్వీపై సీబీఐ, ఈడీ చర్యలపై నితీశ్

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శనివారం తన మిత్రపక్షం ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులపై సీబీఐ, ఈడీ చేసిన అణిచివేత 'రాజకీయ ప్రేరేపితమైనది' అనే వాదనతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. అవినీతి ఆరోపణలపై మిత్రపక్షం ఎటువంటి కళంకం లేకుండా రావాలని 2017లో ఆయన కోరుకున్న వైఖరికి ఇది భిన్నంగా ఉంది. కాగా, 'కళంకిత' రాజకీయ నాయకులతో జతకట్టడం ద్వారా తన స్వంత ప్రతిష్ట దిగజారుతుందనే ఆందోళన కారణంగా ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని, మహాఘట్‌బంధన్‌తో విడిపోవాలని కూడా ఆలోచిస్తున్నారనే ఊహాగానాలను కూడా జేడీ(యూ) నాయకుడు నితీశ్ కొట్టిపారేశారు. మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీతో పాటు కాంగ్రెస్, వామపక్షాలు కూడా ఉన్నాయి. ఈ వారం ప్రారంభంలో లాలూ ప్రసాద్, ఆయన భార్య రాబ్రీదేవిని సీబీఐ ప్రశ్నించడంపై విలేకరులు నితీశ్ అభిప్రాయాన్ని అడిగారు. శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లాలూ ముగ్గురు కుమార్తెలు, ఒక కోడలు ఇళ్లతో సహా అనేక స్థలాలపై దాడులు నిర్వహించింది. తాజాగా చిన్న కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రికి తేజస్వి యాదవ్‌కు సీబీఐ తాజాగా సమన్లు జారీ చేసింది. ఆర్జేడీ రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝూ ఒక వీడియో ప్రకటనలో, లాలూ ఇంటిలో తెల్లవారుజామున 4 వరకు కొనసాగిన ఈడీ దాడుల కారణంగా తేజస్వి గర్భిణీ భార్య అధిక రక్తపోటుతో అనారోగ్యంతో ఉందని తెలుసుకున్న బీహార్ ప్రజలు వీధుల్లోకి వస్తారని హెచ్చరించారు. నితీశ్ కుమార్ మాట్లాడుతూ 'నేను ఏమి చెప్పాలి. అందుకు తగిన ప్రతిస్పందన ఇస్తున్నారు' అని తనదైన శైలిలో చెప్పారు. '2017లో నేను ఇటువైపు (బీజేపీ శిబిరం వ్యతిరేకతలో) ఉన్నప్పుడు ఇలాంటివి జరిగాయి. ఇప్పుడు నేను మళ్లీ ఇక్కడకు వచ్చాను. ఈ విషయాలు మళ్లీ జరుగుతున్నాయి' అని తెలిపారు. ఈ ప్రస్తావన హోటళ్లకు సంబంధించిన భూమికి సంబంధించినది. దీనిలో దర్యాప్తు సంస్థ ఈడీ ఇతరులతో పాటు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తేజస్వి యాదవ్ పేరును కూడా చేర్చింది. కాగా యువ నాయకుడిని తన కథనాన్ని 'వివరించమని' కోరినట్లు నితీశ్ గుర్తు చేసుకున్నారు. బీజేపీ పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకుంది. తన పేరు తొలగిపోయే వరకు నైతిక కారణాలతో తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందిగా నితీశ్... యాదవ్‌ను కోరారని, అయితే ఈ ప్రతిపాదనకు ఆర్జేడీ అంగీకరించలేదని తెలిసింది. జేడీ(యూ) నాయకుడు విసుగు చెంది ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశాడు. ఆయన మాజీ మిత్రపక్షమైన బీజేపీ బేషరతు మద్దతుతో ముందుకు వచ్చింది. తదనంతరం, నితీశ్ రాజీనామా చేసిన 24 గంటలలోపే బీజేపీతో కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలాఉండగా, దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసినందుకు నిరసనగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖపై జేడీ(యూ) సంతకం చేయకపోవడంపై ప్రశ్నించగా, నితీశ్ స్పందిస్తూ, 'వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా పోరాడేందుకు అన్ని పార్టీలు (బీజేపీకి వ్యతిరేకంగా) ఉన్నప్పుడు నేను అక్కడ ఉంటాను' అని తెలిపారు. 'నాకు (ప్రధాన మంత్రి) ఆశయాలు లేవని నితీశ్ పునరుద్ఘాటిస్తూ, ఇటీవల జరిగిన సీపీఐ(ఎంఎల్) సదస్సులో కూడా మహాఘట్‌బంధన్‌లో అన్ని భాగస్వామ్య వర్గాల వారు హాజరయ్యారని నేను స్పష్టం చేశాను' అని అన్నారు. ఎన్‌డీఏయేతర పార్టీల నాయకులపై అవినీతి కేసుల కారణంగా ప్రతిపక్ష శిబిరం నుంచి వైదొలగడం గురించి ఆలోచించగలరా అని అడిగిన ప్రశ్నకు, 'ప్రశ్న తలెత్తదు' అని ఆయన అన్నారు

నయా ఉదారవాద విధానాలతో వ్యవసాయం కార్పొరేటీకరణ

- పెట్టుబడిదారీవర్గం వికాసం... రైతాంగానికి పతనం
- ఏఐకేఎస్ మూడవ అఖిల భారత సదస్సులో రావుల వెంకయ్య

హౌరా: దేశంలో మూడు దశాబ్దాలుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అనుసరించిన నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు కార్పొరేట్లకు ఊడిగం చేశాయని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రావుల వెంకయ్య విమర్శించారు. నయా ఉదారవాద విధానాలతో వ్యవసాయం కార్పొరేటీకరణ జరుగుతోందని అన్నారు. గ్రామాల్లోకి కార్పొరేట్లు అడుగు పెట్టడం వల్ల రైతుల జీవితాలు దుర్భరమయ్యాయన్నారు. అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలను శరణ్యంగా భావించారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలకు ఆహార భద్రత కరువైందని అన్నారు. రావుల వెంకయ్య శనివారం పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో ప్రారంభమైన ఏఐకేకేఎంఎస్ మూడవ అఖిల భారత సదస్సులో భాగంగా ఏఐకేకేఎంఎస్ అధ్యక్షుడు సత్యవన్ అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో 'వ్యవసాయం, రైతు ఉద్యమాలపై బహుళజాతీయుల దాడి' అంశంపై మాట్లాడారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యూటీఓ ప్రోత్సహించిన వాణిజ్య ఉదారవాద విధానాలు, రుణషరతులతో కూడిన రాజీ పద్ధతులను అమలు చేసి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో గ్లోబల్ ఫైనాన్స్ కేపిటల్ ప్రవేశించింది. పర్యవసానంగా వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోయాయని వెంకయ్య అన్నారు. భారత్‌లో ధాన్యం, గోధుమలు, పూలు, పండ్లు, కూరగాయలు పుష్కలంగా పండుతాయని, ఏటా ఆరు మిలియన్ టన్నుల విత్తనాలు ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. హైబ్రిడ్ విత్తనాల వల్ల ఇన్‌పుట్ వ్యయం పెరిగిందని అన్నారు. ఇందుకు బీటీ పత్తిని ఆయన ఉదహరించారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. పంటకు కనీస మద్దతు ధరను శాస్త్రీయ ఫార్ములా ఆధారంగా అంచనా వేయాలని కమిషన్ సిఫార్సు చేయడాన్ని గుర్తుచేశారు. దేశంలో అధికారంలో ఉన్నది మాటల ప్రభుత్వమేగానీ చేతల ప్రభుత్వం కాదని వ్యాఖ్యానించారు. గొప్పలు పోవడం తప్ప ఆచరించేదేమీ ఉండదన్నారు. మూడ్నాలుగు సంవత్సరాలుగా వ్యవసాయంలో పెట్టుబడిదారీ పెత్తనం పెరిగిన పర్యవసానంగా కార్పొరేట్లు, భూస్వాముల వికాసం జరుగుతూ చిన్న, సన్నకారు రైతు పతనానికి దారి తీస్తోందని వెంకయ్య అన్నారు. వ్యవసాయ-వాణిజ్య సంస్థలు, బహుళజాతీయులకు పెత్తనం పెరుగుతుండటం వల్ల ఇన్‌పుట్ సప్లై-ఉత్పత్తి-రీటైల్ సరఫరా అమ్మకాల గొలుసు ప్రభావితమవుతున్నట్లు తెలిపారు. సుస్థిరత మార్కెట్ల నుంచి భారతీయ వ్యవసాయం మళ్లిపోతుండటం వ్యవసాయంలో పెట్టుబడిదారీవర్గ వికాసానికి స్పష్టమైన సంకేతమని వెంకయ్య నొక్కిచెప్పారు. రైతు వ్యతిరేక నయా ఉదారవాద సంస్కరణలను ప్రభుత్వాలు అమలు చేయడం వల్ల వ్యవసాయంలో ఎంఎన్‌సీ పంథాకు దారి తీస్తున్నాయన్నారు. ఐక్య పోరాటాలతోనే దీనికి అడ్డుకట్ట సాధ్యమని తెలిపారు. ఇటీవల రైతాంగం ఏడాదికిపైగా చేపట్టిన నల్లచట్టాల వ్యతిరేక పోరాటాన్ని గుర్తుచేశారు. అదే తరహాలో రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలను కాపాడుకోవాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఏఐకేకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్ ఘోష్ స్వాగతంపలికారు. సదస్సులో నేపాల్‌కు చెందిన అమ్రిత్‌బిస్వకర్మ, బంగ్లాదేశ్‌కు చెందిన అశీస్ కలాప్ , ఏఐకేకేఎంఎస్ నాయకులు ప్రేమ్‌జిత్‌సింగ్ గెహ్లోత్, ఉపాధ్యక్షులు రంగస్వామి తదితరులు మాట్లాడారు. సదస్సులో దాదాపు వెయ్యి మంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన మోదీ

- ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సుకుమార్ దామ్లే
- భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: కార్మిక సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో నిర్వీర్యం చేసిందని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి సుకుమార్ దామ్లే విమర్శించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ సమితి సమావేశాలు శనివారం మహారాష్ట్రలోని సాంగ్లీలో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. మొదటి రోజు సమావేశాలకు సంఘం జాతీయ అధ్యక్షులు కె.రవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన సుకుమార్ దామ్లే మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రెండవసారి అధికారం చేపట్టినప్పటి నుంచి కార్మిక వర్గంపై కక్ష సాధింపు చర్యలుగా స్వాతంత్ర్యానికి పూర్వం సాధించుకున్న 44 లేబర్ చట్టాలను సంస్కరణల పేరుతో నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గం అని విమర్శించారు. ముఖ్యంగా 1996 భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం లేబర్ సోషల్ సెక్యూరిటీ కోడ్‌లో కలిపినందువల్ల భవన నిర్మాణ కార్మికులకు పార్లమెంటు ద్వారా ఆమోదం పొందిన చట్టం నిర్వీర్యం అయిందని తెలిపారు. నేడు అది కనుమరుగైపోయే ప్రమాదం ఏర్పడినందున అసంఘటిత రంగ

కార్మికులయిన భవన నిర్మాణ కార్మికులు బలమైన ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి విజయన్ కొనిసేరి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. నివేదికలో జాతీయస్థాయిలో ఉన్న పరిస్థితులను వివరించారు. జాతీయ స్థాయిలో సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేయడం, కాగ్ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంపై అక్షింతలు వేయడం లాంటి అంశాలను ప్రస్తావించారు. తదుపరి చర్చలు జరిగాయి. చర్చల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని తెలిపారు. సంక్షేమ బోర్డు పాలక మండలిని రద్దు చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కొత్త పాలక మండలి సభ్యులను నియమించకపోవడం దుర్మార్గం అన్నారు. సంక్షేమ బోర్డులో రూ.935 కోట్లు నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు క్లెయిమ్‌లు పరిష్కారం చేయకుండా ఆ నిధులను ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలకు దారి మళ్లించడం జరిగిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో 33 వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ అంటూ ఇసుక కృత్రిమ కొరత సృష్టించి అమాంతంగా రేట్లు పెంచారని, ఒక్క లారీ ధర ఇసుక ధర రూ.30 వేలు పైచిలుకు ఉందన్నారు. మరోవైపు సిమెంట్ కంపెనీలకు వత్తాసు పలకటం వలన సిమెంట్ కంపెనీ యాజమాన్యం సిండికేట్‌గా ఏర్పడి సిమెంట్ ధరలు అమాంతంగా పెంచారని చెప్పారు. కలప, పెయింట్, ఎలక్ట్రికల్, ఐరన్ అధిక ధరకు విక్రయిస్తున్నారని అన్నారు. అధిక ధరలను నియంత్రించటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఈ విధానాల పైన త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. ఆందోళనకు కేంద్ర భవన నిర్మాణ కార్మిక సంఘం మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ జాతీయ సమావేశాలలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసా సాంబయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె.ఉమర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

రూ.600 కోట్ల 'అక్రమ ఆదాయం'

- లాలూ కుటుంబంపై దాడుల్లో ఈడీ గుర్తింపు
- తాజాగా లెక్కల్లో లేని రూ.కోటి స్వాధీనం

న్యూఢిల్లీ: రైల్వే ఉద్యోగాలతో ముడిపడి ఉన్న మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యుల నివాసాలపై దాడులు చేసిన తర్వాత రూ.600 కోట్ల విలువైన అక్రమ ఆదాయాన్ని గుర్తించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం తెలిపింది. దాడుల్లో రూ.1 కోటి లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నామని, లాలూ కుటుంబం, వారి సహచరుల తరపున రియల్ ఎస్టేట్ సహా వివిధ రంగాలలో పెట్టిన మరిన్ని పెట్టుబడులను వెలికితీసేందుకు దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. లాలూ కుమారుడు, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ ప్రసాద్, ముగ్గురు కూతుళ్లతో సంబంధం ఉన్న 24 చోట్ల ఈడీ శుక్రవారం దేశవ్యాప్తంగా సోదాలు నిర్వహించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో లాలూ రైల్వే మంత్రిగా ఉన్న 2004-09 కాలానికి సంబంధించిన 'కుంభకోణం' కేసు ఇది. నామమాత్రపు ధరలకు బదిలీ చేయబడిన భూమి ప్లాట్లకు బదులుగా వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వడానికి లాలూ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం, పాట్నా, ముంబై, రాంచీలోని 24 చోట్ల జరిపిన సోదాల్లో రూ.53 లక్షల నగదు, 1,900 డాలర్ల విదేశీ కరెన్సీ, 540 గ్రాముల బంగారు కడ్డీలు, 1.5 కేజీలకు పైగా బంగారు ఆభరణాలు, నేరారోపణ పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తెలిపింది. ఈ కుంభకోణం కేసులో లాలూ, ఆయన భార్య రాబ్డీ దేవిని సీబీఐ ప్రశ్నించిన వెంటనే ఈడీ సోదాలు జరిగాయి. 2004-09లో లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు కొంతమంది వ్యక్తులు, ముఖ్యంగా ఆయన సొంత రాష్ట్రం బీహార్ నుంచి భారత రైల్వేలోని వివిధ జోన్లలో గ్రూప్-డి స్థానాల్లో నియామకాలు జరిగాయి.

ఉద్యోగ కుంభకోణంలో భూమి విలువ రూ.200 కోట్లు

లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కుటుంబం ఉద్యోగాల కోసం సంపాదించిన భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారుగా రూ.200 కోట్లు ఈడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. లాలూ కుటుంబం సంపాదించిందని ఆరోపించిన ఈడీ ఇతర ఆస్తుల సుదీర్ఘ జాబితాను కూడా ఇచ్చింది. 'రైల్వేలో కల్పించిన ఉద్యోగాల బదులు అప్పటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ కుటుంబం పాట్నా, ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ ప్రదేశాలలో అనేక భూములను అక్రమంగా సంపాదించినట్లు ఇప్పటివరకు జరిగిన పీఎంఎల్ఏ విచారణలో వెల్లడయింది' అని పేర్కొంది. 'ఈ భూముల ప్రస్తుత మార్కెట్ విలువ రూ.200 కోట్ల కంటే ఎక్కువ. దీనికి సంబంధించి, ఈ భూములకు అనేక బినామీదార్లు, షెల్ సంస్థలు, లాభదాయకమైన యజమానులను గుర్తించడం జరిగింది' అని వివరించింది. ఉద్యోగాల కుంభకోణంలో లాలూ కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌ను కూడా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రశ్నించేందుకు సమన్లు పంపింది. పేద గ్రూప్-డి దరఖాస్తుదారుల నుంచి 7.5 లక్షల రూపాయల చొప్పున రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అబు దోజానాతో లాలూ భార్య రాబ్డీ దేవి కుమ్మక్కైన రూ.3.5 కోట్ల కూటమి ఒప్పందం ఇదని పేర్కొంది. ఈ మొత్తంలో ఎక్కువ భాగం తేజస్వి యాదవ్ ఖాతాకు చేరిందని ఆరోపించింది. 'అనేక రైల్వే జోన్లలో నియమితులైన అభ్యర్థుల్లో 50 శాతానికి పైగా లాలూ కుటుంబాల నియోజకవర్గాల నుంచి వచ్చినట్లు దర్యాప్తులో ఉంది. దీనికి సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది' అని తెలిపింది. తేజస్వి యాదవ్ ఢిల్లీ నివాసంలో సీబీఐ శుక్రవారం సోదాలు చేసింది. ఆయన సోదరి రాగిణి, ఇతరులకు సంబంధించిన ఆస్తులపై కూడా ఈడీ సోదాలు చేసింది. కాగా, ఎప్పుడూ 'ఫాసిస్టులు, అల్లర్లకు' ముందు వంగి ఉండని కారణంగా మాత్రమే తన కుటుంబం 'హింసలకు' గురవుతోందని ఆయన సోదరి పేర్కొంది. 'ఈ అన్యాయాన్ని గుర్తుంచుకుంటాం... అన్నీ గుర్తుంటాయి... అందరినీ ఎందుకు హింసిస్తున్నారు.. ఈ ఉదయం నుంచి అందర్నీ హింసిస్తున్నారు. ఒక్కటే నేరం... ఈ వ్యక్తుల్లో లాలూ-రాబ్డీ కుటుంబం ఫాసిస్టులు, అల్లరి మూకల ముందు తలవంచలేదు. ఈ అన్యాయానికి సమయం వచ్చినప్పుడు సమాధానం చెబుతారు. ఇప్పుడు ఇదంతా సహించలేనిది' అని ఆమె హిందీలో శుక్రవారం ట్వీట్ చేసింది.

ఎప్పుడూ వినని సంగీతం వింటారు: ఇళయరాజా

చెన్నై: చిత్రపరిశ్రమలో వెట్రిమారన్ ఒక ముఖ్యమైన దర్శకుడు అని ఇసైజ్ఞాని ఇళయరాజా అన్నారు. అలాగే 'విడుదలై' చిత్రంలో తన నుంచి ఇప్పటివరకు సినీ ప్రేక్షకులు వినని సంగీతాన్ని వింటారని వ్యాఖ్యానించారు. ఆర్.ఎస్. ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానరుపై నిర్మాత ఎల్‌రెడ్ కుమార్ నిర్మించిన 'విడుదలై' చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా చెన్నైలో జరిగింది. ఈ వేడుకలో ఇళయరాజా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. "ఈ మూవీ చిత్ర పరిశ్రమ ఇప్పటివరకు చూడని కాలంలో సాగుతుంది. వెట్రిమారన్ చెప్పే ఒక్కో కథ ఒక ఆణిముత్యంలాంటిది. సినీ ఇండస్ట్రీలో వెట్రిమారన్ కీలకమైన దర్శకుడు. ఈ సినిమాలో ఇప్పటివరకు వినని సరికొత్త సంగీతాన్ని ప్రేక్షకులు వింటారు" అని అన్నారు. అనంతరం దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ఇళయరాజా సార్ ఓ ముఖ్య కారణం. 45 నిమిషాలు సినిమా రూపొందించి, ఇళయరాజాకు చూపించాను. ఆయన పాటే ఈ చిత్రాన్ని ముందుకు తీసుకెళుతుంది. నేపథ్య సంగీతం వినగానే ఒక విధమైన అనుభూతికి లోనయ్యా. ఇళయరాజాతో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభవం. ఆయన షేర్ చేసిన అనేక విషయాలు నాకు మంచి పాఠాలు వంటివి. ఇళయరాజా పాటలను వింటూ పెరిగాం. ఇపుడు ఆయన సంగీతాన్ని ఆనందంతో ఆస్వాదిస్తున్నాం" అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో విలక్షణ నటుడు విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. 'వడ చెన్నై' చిత్రంలో వెట్రిమారన్‌తో కలిసి పనిచేసే అవకాశాన్ని కోల్పోయా. అందుకే 'విడుదలై' చిత్రంలో నటించే ఛాన్స్‌ను మిస్ చేసుకోలేదు అన్నారు. నటుడు సూరి, హీరోయిన్ భవానీ శ్రీ, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, నిర్మాత కలైపులి ఎస్ థాను, నిర్మాత ఎల్‌రెడ్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

వేణూ... మాకు ఇలా షాక్ ఇస్తే ఎలా? చిరంజీవి

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం నేపథ్యంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'బలగం'. వేణు టిల్లు దర్శకుడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా అంతటా మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి శనివారం ఉదయం 'బలగం' టీమ్‌ను ప్రశంసించారు. తన తదుపరి చిత్రం 'భోళా శంకర్' సెట్‌లో 'బలగం' టీమ్‌ను కలిసిన ఆయన చిత్రబృందాన్ని సన్మానించారు. 'కంగ్రాట్స్ వేణు. చిత్రాన్ని చక్కగా రూపొందించావు. ఇంత బాగా సినిమా చేసి మాకు షాకులు ఇస్తే ఎలా? (నవ్వులు). నిజాయతీ ఉన్న సినిమా ఇది. కమర్షియల్ ప్రొడ్యూసర్ ఉన్నప్పటికీ నువ్వే దీనికి పూర్తి న్యాయం చేశావు. తెలంగాణ సంస్కృతిని 100 శాతం చూపించావు. వేణు గతంలో 'జబర్దస్త్' వేదికపై ఓ స్కిట్ చేశాడు. వేణుకు ఇంత టాలెంట్ ఉందా? అని అతడిపై నాకు గౌరవం పెరిగింది. ఈ సినిమా చూశాక.. తన టాలెంట్‌ని మరోసారి నిరూపించుకున్నాడ నిపించింది" అని ఆయన అన్నారు. దీనికి సంబంధించిన వీడియోను 'బలగం' హీరో ప్రియదర్శి ట్విటర్ వేదికగా షేర్ చేశాడు. "చిరు అన్నయ్యా.. మీ సినిమాలు చూసి ఎన్నో సందర్భాల్లో నేను స్ఫూర్తి పొందాను.

పుష్ప-2లో సింక్ సౌండ్ టెక్నాలజీ



హైదరాబాద్: దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్ కాంబినేషన్‌లో వచ్చిన 'పుష్ప' గొప్ప విజయం సాధించింది. ఇప్పుడు ఈ సినిమా రెండో పార్టు 'పుష్ప 2' షూటింగ్ జరుగుతూ ఉంది. దీనిలో ఫహద్ ఫాజిల్, రావు రమేష్, జగపతి బాబు, అనసూయ విలన్‌లుగా ఉంటారని, వీళ్లందరితో పుష్ప ఎలా తలపడతాడో ఈ పార్టు 2 లో చూడాలని అంటున్నారు. బ్రహ్మాజీ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనపడతాడు అని కూడా అంటున్నారు. అయితే దర్శకుడు సుకుమార్ ఏమి చేస్తున్నాడో తెలుసా, సింక్ సౌండ్ ఉపయోగిస్తున్నాడు. అప్పట్లో అంటే బ్లాక్ అండ్ వైట్ చిత్రాలు తీసేటప్పుడు ఈ సింక్ సౌండ్‌ని ఉపయోగించే వారు. సింక్ సౌండ్ అంటే, షూటింగ్ జరుగుతున్నప్పుడు ఎవరి పాత్రలో వాళ్లు వాళ్ల డైలాగ్స్ చెబుతున్నప్పుడే రికార్డు చేసుకోవడం. అంటే ఇంకా మళ్లీ స్పెషల్‌గా డబ్బింగ్ చెప్పడానికి ఆ ఆర్టిస్టు రానవసరం లేదు. ఏదైనా డైలాగు కొంచెం వినపడకపోతే తప్ప. ఆమధ్యలో కొందరు ఇలా సింక్ సౌండ్‌లో రికార్డింగ్ చేశారు కూడా. విజయ్ దేవరకొండ నటించిన 'పెళ్లి చూపులు' సినిమా కూడా ఇలా సింక్ సౌండ్‌లో దర్శకుడు తరుణ్ భాస్కర్ రికార్డు చేశాడు. ఇప్పుడు సుకుమార్ కూడా అదే పద్ధతిని పాటిస్తున్నారు. ఈ సింక్ సౌండ్ వలన షూటింగ్‌లో నటుడు ఎంత భావోద్వేగంతో చెప్పాడో, అలాగే లైవ్‌లో డైలాగ్ ఎలా చెప్పాడో అది రికార్డు అయితే బాగా కనెక్ట్ అవుతుంది.

ఈడీ ప్రత్యేక పీపీ నితేశ్ రానా రాజీనామా

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పదవికి న్యాయవాది నితీశ్ రానా వ్యక్తిగత కారణాలతో శనివారం రాజీనామా చేశారు. 2015 నుంచి రానా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం, కాంగ్రెస్ నాయకుడు డి.కె.శివకుమార్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, ఆయన కుటుంబం, టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాతో సహా అనేక ఉన్నతమైన కేసులలో కేంద్ర దర్యాప్తు సంస్థ తరపున ప్రాతినిధ్యం వహించారు. కాగా ఈడీ కొన్ని ఏర్పాట్లు చేసే వరకు తన కార్యాలయం పరిస్థితిని కోర్టుకు తెలియజేస్తుందని రానా చెప్పారు. హఫీజ్ సయీద్, సయ్యద్ సలావుద్దీన్ వంటి ఉగ్రవాదులపై కేసులలో, అలాగే లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌పై జమ్ముకశ్మీర్ టెర్రర్ ఫైండింగ్ కేసు వంటి విషయాలలో రానా ఈడీకి ప్రాతినిధ్యం వహించారు. అలాగే ఎయిర్ ఇండియా 'కుంభకోణం', విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, భూషణ్ పవర్ అండ్ స్టీల్ మనీ లాండరింగ్ కేసులు, రాన్‌బాక్సీ-రెలిగేర్ మోసం, స్టెర్లింగ్ బయోటెక్ కుంభకోణం, పశ్చిమ పశ్చిమ బెంగాల్ పశువుల స్మగ్లింగ్ కేసుల్లో ఆయన ఈడీకి ప్రాతినిధ్యం వహించారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ తన 'లీగల్ పవర్ లిస్ట్ ఆఫ్ 2020'లో రానాను ఎంపిక చేసింది.

44 ఏళ్ల రానా బ్రిటన్‌లోని కోర్టులో మనీ లాండరింగ్ దర్యాప్తు సంబంధిత విచారణలో ఈడీకి ప్రాతినిధ్యం వహించారు.

శుభ్‌మన్... మెరిసెన్

- తొలిసెంచరీ నమోదు
- కోహ్లి అర్ధసెంచరీ
- డ్రా దిశగా నాలుగో టెస్ట్?

అహ్మదాబాద్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో భారత బ్యాటింగ్ లైనప్ చక్కగా రాణించింది. మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే రోహిత్ శర్మ (35) అవుటయ్యాడు. అయితే ఛటేశ్వర్ పుజారా (42) జతకలవడంతో చెలరేగిన శుభ్‌మన్ గిల్ (128) అద్భుతంగా రాణించాడు. మైదానం నలువైపులా షాట్లు బాదుతూ సెంచరీ సాధించాడు. భారత గడ్డపై ఇదే అతని తొలి టెస్టు శతకం కావడం గమనార్హం.

స్వదేశంలో తొలి టెస్టు సెంచరీ

స్వదేశంలో తొలి సెంచరీ బాదిన గిల్ చాలా సంతోషంగా కనిపించాడు. ఫ్యాన్స్ కూడా గిల్ క్రికెట్‌ను ఏలడానికి వచ్చాడంటూ ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాదు, ఈ ఏడాదిలో గిల్ చేసిన ఐదో సెంచరీ ఇది. మిగతా భారత బ్యాటర్లు అందరూ కలిసి చేసిన సెంచరీలు కూడా ఐదే కావడం గమనార్హం. ఇది చూస్తేనే గిల్ ఎంత సూపర్ ఫామ్‌లో ఉన్నాడో అర్థం చేసుకోవచ్చు. గిల్ ఇలా సెంచరీతో ఆకట్టుకున్న కాసేపటికే.. పుజారా పెవిలియన్ చేరాడు. మర్ఫీ వేసిన బంతిని సరిగా అంచనా వేయలేకపోయిన అతను.. ఎల్బీగా పెవిలియన్ చేరాడు.

కోహ్లి మరో రికార్డు

పుజారా అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లి కూడా పూర్తిగా కంట్రోల్‌తో ఆడాడు. ఆచితూచి ఆడుతూ చెత్త బంతులకు బౌండరీలు బాదుతూ ఆకట్టుకున్నాడు. గిల్, కోహ్లి మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే కాసేపటికే లియాన్ బౌలింగ్‌లో బ్యాక్ ఫుట్‌పై డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించిన గిల్.. ఎల్బీగా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జడేజాతో కలిసి ఆడిన కోహ్లి, ఏడాది కాలంలో తొలి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇది అతని కెరీర్‌లో 29వ టెస్టు హాఫ్ సెంచరీ కావడం గమనార్హం. ఈ క్రమంలోనే భారత గడ్డపై 4 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా కోహ్లి రికార్డు నెలకొల్పా డు. ప్రస్తుత యాక్టివ్ ప్లేయర్లలో మరెవరూ ఈ ఘనత సాధించలేదు.

స్మిత్ కెప్టెన్సీ సూపర్

ఆసీస్ బౌలర్లలో లియాన్, మర్ఫీ, కునేమన్ చక్కగా బౌలింగ్ చేశారు. పిచ్ నుంచి కొద్దిగా టర్న్ లభిస్తుండ టంతో దాన్ని బాగా వాడుకున్నారు. ఈ క్రమంలోనే చాలా టైట్‌గా బౌలింగ్ చేస్తూ వచ్చారు. రోహిత్‌ను కునేమన్ అవుట్ చేయగా.. పుజారాను మర్ఫీ, గిల్‌ను లియాన్ పెవిలియన్ చేర్చారు. మ్యాచ్ మరికాసేపట్లో ముగుస్తుందనగా కొత్త బంతి తీసుకున్న ఆస్ట్రేలియా.. చివర్లో ఒక్క వికెట్ అయినా తీసుకోవాలని భావించింది. కానీ కోహ్లి, జడేజా సాలిడ్ డిఫెన్స్‌తో ఆ జట్టుకు ఈ అవకాశం ఇవ్వలేదు. కాగా, ఈ మ్యాచ్‌లో కూడా స్టీవ్ స్మిత్ తన మార్కు కెప్టెన్సీతో అందరినీ ఆకట్టుకున్నాడు. బౌలర్లకు అను కూలంగా ఫీల్డింగ్ సెట్ చేసి, భారత బ్యాటర్లు పరుగులు చేయడానికి కష్టపడేలా చేశాడు.

మరోసారి వివాదంలోకి షకీబ్

ఢాకా: బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ హల్ హసన్ తన ప్రవర్తనతో మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అనేకసార్లు మైదానంలోనే అతడు అసహ నానికి గురైన సందర్భాలు ఉండగా, ఈసారి మైదానం బయట అలాంటి ఘటన చోటు చేసుకుంది. వందలాది మంది మధ్యే ఓ అభిమానిని క్యాప్‌తో కొడుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. దీంతో షకీబ్ ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. చట్టోగ్రామ్‌లో ఓ ప్రచార కార్యక్రమంలో షకీబ్ పాల్గొన్నాడు. దీంతో అతడిని చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి పోటెత్తారు. పెద్దసంఖ్యలో అతడిని చుట్టుముట్టారు. దీంతో సహనం కోల్పోయిన ఈ క్రికెటర్.. క్యాప్‌తో ఓ అభిమానిని కొట్టాడు. షకీబ్‌కు ఇలాంటి వివాదాలు కొత్త కాదు. మైదానంలో చాలాసార్లు అంపైర్లతో గొడవకు దిగిన సందర్భాలున్నాయి. తోటి ఆటగాళ్లతో సరిగ్గా ఉండడనే వార్తలు కూడా వచ్చాయి. మరోవైపు, షకీబ్‌కు తమీమ్ ఇక్బాల్, మరో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లతో గొడవలు ఉన్నట్లు గత నెలలో ఆ దేశ క్రికెట్ బోర్డు అధ్యక్షుడే చెప్పడం గమనార్హం.

రోహిత్ శర్మ అరుదైన ఘనత



అహ్మదాబాద్: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 17 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో ఈ ఫీట్ సాధించాడు. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద 17 వేల పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. 17 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మూడో రోజు బ్యాటింగ్ కొనసాగించిన రోహిత్.. మరో ఐదు పరుగులు చేయగానే అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున 17 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఏడో క్రికెటర్‌గా నిలిచాడు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగు తుండగా.. విరాట్ కోహ్లి, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

ఏడో భారత బ్యాటర్‌గా..

సచిన్ టెండూల్కర్ 664 మ్యాచ్‌ల్లో 34,357 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లి 494 మ్యాచ్‌ల్లో 25,047 రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. రాహుల్ ద్రవిడ్ 504 మ్యాచ్‌ల్లో 24,064, సౌరవ్ గంగూలీ 421 మ్యాచ్‌ల్లో 18,433, మహేంద్ర సింగ్ ధోనీ, 535 మ్యాచ్‌ల్లో 17,092 పరుగులతో రోహిత్ శర్మ కన్నా ముందున్నారు. ఈ తరం క్రికెటర్లలో ఈ ఘనతను అందుకున్న నాలుగో ప్లేయర్‌గా రోహిత్ నిలిచాడు. 25,047 పరుగులతో కోహ్లి టాప్‌లో ఉండగా.. జోరూట్(18,048), డేవిడ్ వార్నర్(17059), రోహిత్ శర్మ(17011) కన్నా ముందున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.